# శాస్త్రసాంకేతిక ఉప్పెనలో మానవ మనుగడ ప్రశ్నార్థకం !

## (24 జనవరి "అంతర్జాతీయ విద్యా దినోత్సవం" సందర్భంగా)

వ్యక్తులు, పౌర సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి నమోదు చేసుకోవడానికి విద్య అనే పదునైన సాధనం దోహదపడుతున్నది. విద్య మనందరి ప్రాథమిక హక్కు. "విద్య లేని వాడు వింత పశువు" అన్నారు పెద్దలు. నేడు అత్యాధునిక శాస్త్రసాంకేతికత అద్భుతాలను సృష్టిస్తూ భూగోళాన్ని కుగ్రామంగా మార్చి వేసింది. ప్రపంచ 820 కోట్ల మానవాళి క్షణాల్లో స్మార్ట్‌ఫోన్ లేదా అంతర్జాల వేదికల్లో కలుసుకోగలుగుతున్నారు. "కృత్రిమ మేధ లేదా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)"తో పాటు "ఆటోమేషన్" వలయంలో చిక్కి నేటి ఆధునిక మానవుడు తనను తాను మైమరిచి పోతున్నాడు. ఆధునిక విద్య కొరవడిన వ్యక్తి మూగ, చెవిటి వాడిగా మిగిలిపోయే దుస్థితులు వచ్చాయి. ప్రజా సంక్షేమ వారది విద్య మాత్రమే అని తేలిపోయింది. డబ్బుతో సాధించలేనివి విద్యతో సుసాధ్యం అవుతున్నాయి. విద్యావంతుల జనాభా కలిగిన దేశం అభివృద్ధి పథంలో వడి వడిగా పయనిస్తున్నది. నాణ్యమైన విద్య కల్పించాల్సిన బాధ్యత ప్రధానంగా ప్రభుత్వాల పైన, తర్వాత ప్రైవేట్ సంస్థల పైన ఆధారపడుతున్నది.

### విద్య ప్రాముఖ్యత - అంతర్జాతీయ విద్యా దినోత్సవం-2025 ఇతివృత్తం:

విద్య ద్వారా విషయపరిజ్ఞానం, వివేకం, నైపుణ్యాలు, జీవన విలువలు, సాధారణ జ్ఞానం అందుతాయి. ప్రజా సమస్యలకు చక్కటి పరిష్కారాలు, సరళ జీవన విధాన రీతులకు విద్య దోహదపడుతుంది. పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, అసమానతల తొలగింపు, సామాజిక సమ్మిళిత అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక ప్రగతి పరుగులు, కుటుంబ సంక్షేమం లాంటిప్రధాన ప్రయోజనాలు విద్య వల్ల ఒనగూడుతాయి. విద్య ప్రాముఖ్యతను సాధారణ ప్రజలకు వివరించడానికి, సమాజ చైతన్యానికి ప్రతి ఏట 24 జనవరి రోజున ఐరాస నేతృత్వంలో 2019 నుంచి ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ విద్యా దినోత్సవం" జరుపుకుంటున్నాయి. అంతర్జాత విద్యా దినోత్సవం-2025 ఇతివృత్తంగా "ఏఐ - విద్య : ఆటోమేషన్ ప్రపంచంలో మానవ గుర్తింపును సంరక్షించడం" అనే అంశాన్ని తీసుకున్నారు. అత్యాధునిక ఏఐతో పాటు ఆటోమేషన్ రంగం కలిసి మానవుడి జీవన సరళిని సమూలంగా మార్చు వేసే స్థాయి వచ్చింది. మనిషి కనుగొన్న ఏఐ-ఆటోమేషన్ పరిజ్ఞానాలు మానవ గుర్తింపు లేదా హుమన్ ఐడెంటిటీని ప్రశ్నార్థకం చేస్తున్నట్లు తోస్తున్నది. మానవ హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారాలతో ఐరాస సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన సుసాధ్యం అవుతున్నది. ఇలాఅత్యాధునిక విద్యతో మానవ ప్రగతి వాయు వేగంతో పరుగులు పెడుతున్నది.

### ఏఐ-ఆటొమేషన్ ఆయుధం మానవ గుర్తింపును మసకబార్చగలదా !

విద్య ప్రాధాన్యాలను అవగాహన పరచడం, యువత/బాలలకు నాణ్యమైన విద్యను అందించడం, సృజనకు పదును పెట్టడం, వినూత్న అవిష్కరణలకు పట్టం కట్టడం, సమాజ స్థితిగతులు/సవాళ్లను అధ్యయనం చేయడం, జీవనశైలిని మార్చడం, సామాజిక సంబంధాలను ప్రభావితం చేయడం, మన వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం, మనిషి ఆలోచనలను కట్టడి చేయడం, జ్ఞాపకశక్తిని పలుచబరచడం, సంక్లిష్ట సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపడం, ఆలోచనాసామర్థ్యాలను తగ్గించడం లాంటి చర్చలను అంతర్జాతీయ విద్యా దినోత్సవ వేదికగా నిర్వహించాలి. మానవుడు అందించిన ఏఐ, కల్పన (అల్‌గారిథమ్స్) గణిత సాంకేతిక సూచనలతో పని చేస్తున్న టెక్నాలజీ, మానవ ఆలోచనలు, భావోద్వేగాలు, సృజన, వినూత్న ఆవిష్కరణలు, అవగాహనలను ఏ నాడు అధిగమించలేదని, మానవ గుర్తింపును లేదా మానవ చాతుర్యాలను మసకబార్చడం అసాధ్యమని తెలుసుకోవాలి. శాస్త్ర సాంకేతిక సృష్టి మనిషి ఇచ్చే ఆదేశాల మీద మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి.

విద్యా వృక్షపు వేర్లు చేదుగా ఉన్నప్పటికీ అది అందించే పండ్లు మాత్రం తియ్యగా ఉంటాయి. ప్రపంచ సానుకూల మార్పులకు సరైన విద్య అనే పదునైన ఉపకరణం మాత్రమే. విద్యలో పెట్టుబడికి అత్యధిక వడ్డీ చెల్లించబడుతుంది. అజ్ఞాన చీకట్లను చిదిమే ప్రకాశవంతమైన దివ్వె విద్య మాత్రమే. ఒక వ్యక్తి విద్యావంతుడు అయితే అనేక అపూర్వ అవకాశాలు ఆయన వెంట పడతాయి. ఇలాంటి అత్యంత శక్తివంతమైన విద్యను అందరూ సొంతం చేసుకొని, కుటుంబాలు, పౌర సమాజం, ప్రపంచ అభివృద్ధికి కృషి చేయాలని సవినయంగా కోరుకుందాం. విద్యను అందరికీ అందుబాటులో ఉంచుదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మార్చి 8 వరకు పదో వార్షికోత్సవం.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ముగింపు

న్యూఢిల్లీ, జనవరి 23:దేశంలో బాలికల రక్షణలో, వారిని విద్యావంతులను చేయడంలో, సాధికారులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ దశాబ్ద కాలపు కృషికి గుర్తుగా.. బేటీ బచావో బేటీ పఢావో (బీబీబీపీ) పథకం పదో వార్షికోత్సవాన్ని మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది నిర్వహించనుంది. వికసిత భారత్ 2047 దార్శనికతకు, 'మహిళల అభివృద్ధి' నుంచి 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి' దిశగా అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించారు. జీ20కి భారత్ అధ్యక్షత వహించిన సందర్భంగా ఈ అంశానికి అధిక ప్రాధాన్యమివ్వగా, ప్రస్తుతం బ్రెజిల్ అధ్యక్షతన జీ20 ఆ విధానాన్నే అవలంబిస్తోంది.

ఢిల్లీలోని విజ్ఞాన భవన్ లో బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. కేంద్ర ఆరోగ్య - కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జె.పి. నడ్డా, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి, సహాయ మంత్రి శ్రీమతి సావిత్రీ ఠాకూర్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

సాయుధ బలగాలు, పారా మిలిటరీ బలగాలు, ఢిల్లీ పోలీసు విభాగం నుంచి మహిళా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన డిప్యూటీ సెక్రటరీ, ఆపై స్థాయిల్లో ఉన్న మహిళా అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. విద్యార్థినులు (మైభరత్ వలంటీర్లు), అంగన్ వాడీ సూపర్ వైజర్లు/వర్కర్లు, రాష్ట్రాలు - జిల్లాల ప్రతినిధులనూ కార్యక్రమంలో పాల్గొంటారు.

యూనిసెఫ్, యూఎన్ ఉమెన్, యూఎన్ డీపీ, యూఎన్ఎఫ్ పీఏ, ప్రపంచ బ్యాంకు, జర్మన్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జీఐజెడ్) వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ నెల 22 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన మార్చి 8 వరకు ఈ పదో వార్షికోత్సవాలను నిర్వహించనున్నారు. విజ్ఞాన భవన్ లో జరిగే ప్రారంభోత్సవంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. ఉత్తమ విధానాలను సంగ్రహంగా వివరించే సంకలనాన్నీ ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పోర్టల్ లను కూడా ప్రారంభిస్తారు.

అవే కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తారు. మొదటి రోజుతోపాటు గణతంత్ర దినోత్సవం, మార్చి 8న ప్రత్యేక కార్యక్రమాలుంటాయి. ఇందులో భాగంగా ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానోత్సవాలతోపాటు సంకల్ప్: మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు జరుగుతాయి. విద్యార్థినులు, పలు రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు, సామాజిక బృందాలను ఇందులో భాగస్వాములను చేస్తారు.

వార్షికోత్సవాలు కొనసాగినన్ని రోజులూ పత్రికలు, డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే జాతీయ స్థాయి ప్రచారం ఈ పథకం సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తుంది. సుస్థిర విధానాలకు అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు.

దేశంలో లింగ అసమానత్వం, బాలల లింగ నిష్పత్తి (సీఎస్ఆర్)లో క్షీణత సమస్యను పరిష్కరించడం కోసం 2015 జనవరి 22న హర్యానాలోని పానిపట్ లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'బేటీ బచావో బేటీ పఢావో' పథకాన్ని ప్రారంభించారు. పైన పేర్కొన్న ప్రమాదకర ధోరణులను తిప్పికొడుతూ.. ఈ పథకం విధానపరమైన కార్యక్రమం నుంచి జాతీయ స్థాయి ఉద్యమంగా ఎదిగింది.

లింగ వివక్ష నమన్వయను పరిష్కరించడంతోపాటు ఆడపిల్లలకు విలువనివ్వడం, వారికి హక్కులూ అవకాశాలను అందించేలా సాంస్కృతిక పరివర్తనను ప్రోత్సహించడంలో - ప్రభుత్వ సంస్థలు, పౌర సమాజం, ప్రసార మాధ్యమాలు, ప్రజలను బేటీ బచావో బేటీ పడావో పథకం ఏకీకృతం చేసింది. 2014-15లో జనన స్థాయిలో జాతీయ లింగ నిష్పత్తి (ఎస్ఆర్ బీ) 918గా ఉండగా, 2023-24 నాటికి 930కి పెరిగింది. సెకండరీ స్థాయిలో బాలికల స్థూల నమోదు నిష్పత్తి 2014-15లో 75.51% ఉండగా, 2023-24 నాటికి 78%కి పెరిగింది. ఆస్పత్రుల్లో ప్రసవాలు 61% నుంచి 97.3%కి పెరిగాయి. మొదటి మూడు నెలల్లో ప్రసవానంతర సంరక్షణ కోసం చేసుకున్న నమోదులు గణనీయమైన స్థాయిలో 61% నుంచి 80.5%కి పెరిగాయి. ఇవన్నీ బేటీ బచావో బేటీ పఢావో పథకం సాధించిన కీలకమైన విజయాలు.

మహిళా సాధికారతను చాటేలా యశస్వినీ బైక్ సాహసయాత్ర, బడి బయట ఉన్న లక్ష మందికిపైగా బాలికలను తిరిగి బడిలో చేర్పించడం కోసం కన్యా శిక్షా ప్రవేశ్ ఉత్సవ్, ఆడపిల్లలను వదిలేయకుండా అవగాహన కల్పించేలా డోర్ టీవీ షోతో భాగస్వామ్యం... ఇలా పలు ప్రభావవంతమైన కార్యక్రమాలను బేటీ బచావో బేటీ పఢావో చేపట్టింది. శ్రామిక శక్తిలో భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన జాతీయ నైపుణ్య కార్యక్రమం: బేటియా బనే కౌశల్ వంటి ఇతర కార్యక్రమాలనూ ఈ పథకం కింద చేపట్టారు.

భాగస్వామ్య మంత్రిత్వ శాఖల సహకారంతో.. లింగ సమానత్వాన్ని పెంపొందించడం, బాలికా సాధికారతనుసాధించడంలో తన నిబద్ధతను మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటిస్తోంది. మహిళలు కేవలం లబ్ధిదారులు మాత్రమే కాక, వారే మార్పునకు సారథులుగా నిలిచే వికసిత భారత్ ను నిర్మించడంలో దేశ అంకితభావాన్ని బేటీ బచావో బేటీ పఢావో ఈ పదేళ్ల ప్రస్థానం స్పష్టంచేస్తోంది. ఈ పథకం ఆడపిల్లలకు మరింత ఉజ్వలమైన, సమ్మిళితమైన భవిష్యత్తును అందిస్తోంది. దేశవ్యాప్తంగా సానుకూల మార్పునకు బేటీ బచావో బేటీ పఢావో భరోసా ఇస్తోంది.

# మహాకుంభమేళా 2025: విజ్ఞానాన్ని పంచుతున్న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ డిజిటల్ ప్రదర్శన పౌరులకు చేరువలో భారతీయ కొత్త నేర చట్టాలు

న్యూఢిల్లీ, జనవరి 23:భారతీయ కొత్త నేర చట్టాలు ? భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక సురక్షా సంహితలను ప్రజలు వివరణాత్మకంగా, సులభ గ్రాహ్యంగా అవగాహన చేసుకోగలిగేలా త్రివేణీ మార్గ్ తో పాటు ప్రయాగరాజ్ లోని మహాకుంభమేళా వద్ద సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆకర్షణీయమైన డిజిటల్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

నిర్దిష్ట కోణాల్లో చిత్రాలను ప్రదర్శించే గోడలు (అనమార్ఫిక్ వాల్స్), ఎల్ఈడీ టీవీ తెరలు, ఎల్ఈడీ గోడలు, హాలోగ్రాఫిక్ సిలిండర్ల ద్వారా భారత ప్రభుత్వ వివిధ సంక్షేమ పథకాలు, కొత్త విధానాలు, చట్టాలు, భారత రాజ్యాంగంపై సమాచారాన్ని ఈ ప్రదర్శన అందిస్తుంది. న్యాయం, నిష్పక్షపాతం ప్రాతిపదికలుగా కొత్త చట్టాలు రూపొందాయని, చట్టపరమైన ప్రక్రియతో సాంకేతికతను అనుసంధానం చేయడం ద్వారా న్యాయానికి ప్రజా భద్రతకూ ప్రాధాన్యం లభిస్తోందని ఆడియో-విజువల్ మాధ్యమం ద్వారా ఈ ప్రదర్శనలో వివరిస్తున్నారు.

భారతదేశ న్యాయ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండేలా కొత్త చట్టాలను రూపొందించారు.

# రాజకీయాల్లో వారసత్వం ఉండదు..ప్రతిభ ఆధారంగానే లోకేష్‌కు చాన్స్

**-జీవనోపాధి కోసం 33 ఏళ్ల క్రితమే వ్యాపారంలోకి వచ్చా**
**-కేంద్ర కేబినెట్‌లో చేరే ఆలోచన అస్సలు లేదు**
**-వికసిత భారత్ విజన్‌తోనే ముందుకు సాగుతున్నాం**
**-సాంకేతికంగా బలమైన వృద్ధి సాధించిన భారత్**
**-ఏ రాష్ట్రం నుంచి వచ్చిన భారతీయులంతా ఒక్కటే**
**-దావోస్‌లో మనసు విప్పి మాట్లాడిన సీఎం చంద్రబాబు**



దావోస్, జనవరి 23:రాజకీయాల్లో వారసత్వం ఉండదని.. చుట్టూ ఉన్న పరిస్థితులతో అవకాశాలు వస్తాయన్నారు ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాజకీయాలు జీవనోపాధి కాదన్నారు. జీవనోపాధి కోసం తాను రాజకీయాలపై ఆధారపడలేదని, అందుకే 33ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాలను ప్రారంభించానని చెప్పారు. బిజినెస్ అయితే లోకేష్‌కు తేలికైన పని అని, కానీ.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. లోకేశ్ రాజకీయాల్లోకి రావడంలో కుటుంబ వారసత్వం లేదని, ప్రజాసేవలో తృప్తిగా ఉన్నారని చెప్పారు.

### మీడియా భేటీలో చిట్‌చాట్..

దావోస్ వేదికగా భారత్ తరపున నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి చంద్రబాబు మాట్లాడుతూ.. ఎవరైనా ఒకసారి మోసం చేసి అధికారంలోకి రావచ్చని.. ప్రతిసారీ అది సాధ్యం కాదన్నారు. వికసిత భారత్ విజన్‌తో వృద్ధి రేటు కోసం అంతా కలిసి పనిచేస్తే దేశాభివృద్ధి సాధ్యమేనని అన్నారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాలు పోటీపడినా ఇండియా ఫస్ట్ అన్నదే తమ విధానం అన్నారు.. .అంతర్జాతీయంగా ఇండియా బ్రాండ్ అత్యంత పటిష్టంగా ఉందని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. పని చేసే యువత ఉన్న దేశంగా భారత్‌కు స్వర్ణయుగం మొదలైందన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఇక నుంచి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. తాను కేంద్ర మంత్రి వర్గంలో చేరబోవడం లేదని చెప్పారు.

### ఏ రాష్ట్రం నుంచి వచ్చినా.. భారత్ అంతా ఒక్కటే

గతంలో దావోస్ కు ఒకరిద్దరు సీఎంలు, కేంద్రమంత్రులు వచ్చేవారని.. చరిత్రలో మొదటిసారి భారత్ తరపున అందరం కలిసి మాట్లాడుతున్నామని చెప్పారు. దేశంలో వివిధ పార్టీల నుంచి వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చినా.. దావోస్‌లో అందరం ఒక్కటేనన్నారు. దావోస్ నుంచి పెట్టుబడులు రాబట్టేందుకు దేశంలో అన్ని రాష్ట్రాలు పోటీపడుతున్నా టీమ్ ఇండియాగా అందరిది ఒకే లక్ష్యం అన్నారు. భారత్ నుంచి దావోస్ సదస్సుకు హాజరు అవుతున్న వారిలో తానే సీనియర్‌ను అని చంద్రబాబు సరదాగా వ్యాఖ్యానించారు. 1997 నుంచి దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు అవుతున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో భారత్‌కు చాలా తక్కువ గుర్తింపు ఉండేదనీ.. ఇప్పుడు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థగా 2028 నాటికి భారత్ కు ఇంక్రిమెంటల్ గ్రోత్ రేట్ సానుకూలమైన అంశం అన్నారు. ప్రపంచంలో ఇప్పుడు ఇండియా అన్‌స్టాపబుల్ అంటూ సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### సాంకేతికంగా భారత్ అభివృద్ధి..

సుస్థిర వాతావరణం కోసం 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా భారత్ పని చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుందని చంద్రబాబు అన్నారు. అందులో 165 గిగా వాట్ల విద్యుత్ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. దావోస్ లో భారత్ లోని వివిధ రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీ పడుతున్నాయని.. కానీ, అంతా ఐక్యంగా దేశం కోసం కలిసి పనిచేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రులు గా తాము వేర్వేరు పార్టీలకు చెందిన వారం అయినా ఐక్యంగా ఆలోచించేది దేశం కోసం ప్రజల కోసమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యం, వ్యవసాయం, మానవాభివృద్ధి లో డీప్ టెక్ లాంటి సాంకేతికత రావాలని అన్నారు. పెట్టుబడులు ఆకర్షించడంలో, వృద్ధిరేటులో ఏపీ చాలా కృషి చేయాల్సి ఉందన్నారు. మరోవైపు ప్రపంచం నుంచి తీసుకెళ్ళడం కంటే దానికే సాంకేతికతను భారత్ అందిస్తోందని అన్నారు. వనరులు అవకాశాలను ప్రపంచానికి చూపుతున్నామని అన్నారు. 2047 కల్లా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని అన్నారు.

### గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదకలో బెస్ట్..

ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ విశేష కృషి చేస్తోందని చంద్రబాబు అన్నారు. దాదాపు అన్ని టెక్ కంపెనీల సీఈవోలు భారత సంతతికి చెందినవారే. సాంకేతికతను ముందుగా అందిపుచ్చుకున్న దేశంగా భారత్ ప్రయోజనాలు పొందుతోంది. వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఉన్న యువత, జనాభా ఎక్కువగా ఉండటం భారత్ కు వరాలు. ప్రపంచం మొత్తానికి ఇండియా సేవలందిస్తోంది. ప్రపంచంలో అన్ని ప్రాంతాల ప్రజలకు అత్యంత ఆమోదయోగ్యులు భారతీయులే అన్నారు.. ఇక, దావోస్ పర్యటన ముగించుకుని ఇవాళ రాత్రి ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకుంటారు.. లోకేష్ ఇవాళ, రేపు కూడా దావోస్ లో ఉండనున్నారు.

# కోణార్క్ సూర్యదేవాలయం వద్ద డిఎమ్ఎఫ్ ప్రదర్శనను సందర్శించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 23:కేంద్ర గనుల శాఖా మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, కోణార్క్‌లోని ప్రసిద్ధ సూర్య దేవాలయంలో నిర్వహిస్తున్న జిల్లా మినరల్ ఫౌండేషన్ (డిఎమ్ఎఫ్) ప్రదర్శనను సందర్శించారు. ఒడిశా ప్రభుత్వ సహకారంతో ఈనెల 18 నుంచి 21 వరకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఈ ప్రదర్శనను నిర్వహించింది. తన పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రి వివిధ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జిల) సభ్యులతో సంభాషించారు. అలాగే గనుల ప్రభావ ప్రాంతాల్లో డిఎమ్ఎఫ్ నిధుల కారణంగా సాధ్యమైన గణనీయమైన మార్పు ప్రభావాన్ని ప్రదర్శించే వినూత్న ఉత్పత్తులు, పరిష్కారాలు గల ఈ ప్రదర్శనను ఆయన ఆసక్తిగా తిలకించారు.

"సుస్థిర అభివృద్ధి ద్వారా కమ్యూనిటీలకు సాధికారత కల్పించడం" అనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో డిఎమ్ఎఫ్ నిధుల సహాయంతో స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జిలు), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ), హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సిఎల్), ఎన్ఎఎల్‌సివో, హెచ్‌జెడ్ఎల్/వేదాంత, ఒడిషా ప్రభుత్వాల కృషిని చాటుతూ ఏర్పాటైన 18 అద్భుతమైన స్టాళ్లు ప్రదర్శనకు ప్రాణం పోశాయి. ఎస్‌హెచ్‌జిల మహిళలు చేతితో తయారు చేసిన వస్తువులు, చేతితో నేసిన బట్టలు, ధృఢమైన దారాలు, అలాగే డిఎమ్ఎఫ్ నిధులతో కొనసాగుతున్న సుస్థిర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నమూనాలు సహా పర్యావరణ అనుకూలమైన, సుస్థిర పరిష్కారాలపై దృష్టి సారించిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. దీనిలో పాలుపంచుకున్న వారి సృజనాత్మకతను, సామర్థ్యాలను ప్రతిబింబిస్తూ పర్యావరణ అనుకూలమైన, స్థానికంగా రూపొందించిన ఉత్పత్తులు ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఈనెల 21 నాటికి, ఈ ప్రదర్శనలో పాల్గొన్న మహిళా సంఘాలు రూ. 9 లక్షలు పోగు చేయడం ద్వారా ఈ ప్రదర్శన ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. అలాగే ఆర్థిక సాధికారతను పెంపొందించుటలో ఇలాంటి కార్యక్రమాల ప్రభావాన్ని చాటి చెప్పింది. ఎన్ఎఎల్‌సివో, ఓఎమ్‌సీలకు చెందిన సీనియర్ అధికారులతో కలిసి ఈ ప్రదర్శనను గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ఫరీదా ఎమ్. నాయక్ ఈ నెల 18న ప్రారంభించారు. సుస్థిర అభివృద్ధి, సమాజ సంక్షేమం పట్ల మంత్రిత్వ శాఖ నిబద్ధతకు ఈ ప్రదర్శన నిదర్శనంగా నిలిచింది.

కోణార్క్‌లోని ఎకో రిట్రీట్‌లో జరిగిన 3వ జాతీయ గనుల మంత్రుల సదస్సులో రెండో రోజు సహకారం, ఆవిష్కరణలను పెంపొందించడం, విజ్ఞానాన్ని పంచుకోవడం వంటి అంశాలపై ఫలవంతమైన చర్చలు జరిగాయి. 11 రాష్ట్రాలు అందించిన వివరణాత్మక ప్రెజెంటేషన్లు, వేలం ప్రక్రియల ప్రదర్శనలు, వినూత్న పద్ధతులు, పారదర్శకంగా, సమర్థంగా వనరుల వినియోగాన్ని పెంచే వ్యూహాలు వంటి ప్రధాన అంశాలు సదస్సులో ప్రధానాంశాలుగా ఉన్నాయి.

కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించడంలో మైనింగ్ రంగం పాత్ర కీలకమని చెప్పారు. అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం ఏమాత్రం ఉదాసీనత లేకుండా పనిచేస్తుందని పునరుద్ఘాటించారు అలాగే పర్యవేక్షణ, అమలు విధానాలను బలోపేతం చేయడంలో అత్యాధునిక సాంకేతికతలను అవలంబించాలని ఆయా రాష్ట్రాల మంత్రులను కోరారు. పర్యావరణ పునరుద్ధరణ, సుస్థిరత కోసం బాధ్యతాయుతమైన గనుల మూసివేత విధానాల ప్రాముఖ్యతను కూడా శ్రీ కిషన్ రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. పర్యావరణంపై మైనింగ్ కార్యకలాపాల ప్రభావాన్ని తగ్గించడానికి అడవుల పెంపకం, సౌరశక్తి వినియోగం, సుస్థిరమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులు సహా హరిత కార్యక్రమాలను ఏకీకృతం చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను ఆయన స్పష్టం చేశారు.

ఈ సదస్సులో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ గురించి విలువైన సూచనలు చేసిన పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఇఎఫ్‌సీసీ) గణనీయమైన సహకారం అందించింది. పర్యావరణ పరిరక్షణతో ఆర్థిక వృద్ధిని సమతుల్యం చేసే విధానాలను అమలు చేయడంలో రాష్ట్రాలు, వాటాదారులకు ఈ సూచనలు మార్గనిర్దేశం చేశాయి. అలాగే, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎమ్ఎస్) సైతం మైనింగ్ కార్యకలాపాల్లో కార్మికుల భద్రతను మెరుగుపరచడం కోసం భద్రతా ప్రమాణాలను, సాంకేతిక పురోగతి, శిక్షణా కార్యక్రమాలను గురించి కీలకమైన సూచనలు చేసింది.

రాష్ట్రాలు, వాటాదారులు ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, సవాళ్లను ఎదుర్కోవడానికి అలాగే భారత మైనింగ్ రంగ సుస్థిరమైన అభివృద్ధికి భాగస్వామ్యాలను నిర్మించడానికి ఈ వేదిక ఒక ప్రత్యేక అవకాశంగా నిలిచింది. నూతన ఆవిష్కరణలు, సామర్థ్యాలను పెంపొందించుకోవడం, మైనింగ్ కార్యకలాపాల ప్రయోజనాలు కింది స్థాయి వరకూ చేరుకునేందుకు చర్యలు చేపట్టడం వంటి లక్ష్య సాధన కోసం మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

# నేతాజీ జన్మస్థలమైన కటక్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ఒడిశా ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 23:నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మస్థలమైన చారిత్రక నగరం కటక్ లోని బారాబతి కోటలో పరాక్రమ దివస్ సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. నేతాజీ 128వ జయంతి సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 25 వరకు ఆయనను స్మరించుకుంటూ నిర్వహించే ఈ వేడుకలో వివిధ కార్యక్రమాలుంటాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ ప్రారంభిస్తారు.నేతాజీ జయంతిని 'పరాక్రమ్ దివస్'గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. మొదటి పరాక్రమ్ దివస్ ను కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ లో నిర్వహించారు. 2022లో ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద నేతాజీ హోలోగ్రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 2023లో అండమాన్ - నికోబార్ ద్వీపసమూహంలో 21 పేరులేని ద్వీపాలకు 21మంది పరమవీర చక్ర పురస్కార గ్రహీతల పేర్లు పెట్టారు. 2024లో ఐఎన్ఏ విచారణలు జరిగిన ఢిల్లీలోని చారిత్రాక ఎర్రకోట వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు.ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. ఈ ఏడాది పరాక్రమ్ దివస్ వేడుకను నేతాజీ జన్మస్థలం, ఆయన తొలి భావాలను తీర్చిదిద్దిన కటక్ నగరంలో సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. ఒడిశా ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు నేతాజీకి నివాళి అర్పించడం, ఆయన జన్మించిన ఇంటి వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో ఈ మూడు రోజుల కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆ భవనాన్ని ప్రస్తుతం మ్యూజియంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రధానమంత్రి వీడియో సందేశంతో బారాబతి కోటలో పరాక్రమ్ దివస్ వేడుకలు మొదలవుతాయి. ఇందులో భాగంగా సుభాష్ చంద్రబోస్ జీవిత విశేషాలను వివరించేలా అరుదైన చిత్రాలు, లేఖలు, వివిధ పత్రాలతో ప్రదర్శననూ నిర్వహిస్తారు. ఆయన అద్భుత ప్రస్థానాన్ని వివరించేలా అగుమెంటెడ్/ వర్చువల్ రియాలిటీ ప్రదర్శనలు కూడా ఉంటాయి. శిల్పకళా వర్క్ షాప్, చిత్రలేఖన పోటీ-వర్క్ షాప్ లను కూడా ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్నారు.

# స్క్రాంజెట్ ఇంజిన్ ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించిన డీఆర్డీవో

న్యూఢిల్లీ, జనవరి 23:ఎక్కువ కాలం మన్నికతో ఉండగలిగేలా సూపర్ సోనిక్ కంబషన్ రామ్ జెట్/ స్క్రాంజెట్ హైపర్ సోనిక్ సాంకేతికతను అభివృద్ధి చేయడానికి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో)కు చెందిన హైదరాబాద్ ప్రయోగశాల (డీఆర్డీఎల్) శ్రీకారం చుట్టింది. ఇటీవల ఈ సాంకేతికతలను అభివృద్ధి చేసిన డీఆర్డీఎల్.. దేశంలో మొదటిసారిగా 120 సెకన్ల పాటు అత్యాధునిక యాక్టివ్ కూల్డ్ స్క్రామ్‌జెట్ కంబస్టర్ గ్రౌండ్ టెస్ట్ ను నిర్వహించింది. ఈ ప్రయోగాత్మక పరీక్ష (గ్రౌండ్ టెస్ట్) విజయవంతం కావడం తదుపరి తరం హైపర్ సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుంది.అధునాతన ఆయుధ తరగతికి చెందిన హైపర్ సోనిక్ క్షిపణులు మాక్ 5 వేగంతో.. లేదా గంటకు 5,400 కిలోమీటర్లకు మించిన వేగంతో ఇవి ప్రయాణిస్తాయి. ప్రస్తుత వాయు రక్షణ వ్యవస్థలను అధిగమించి.. వేగంగా, ప్రభావవంతంగా దాడులు చేయగల సామర్థ్యంతో ఈ అధునాతన ఆయుధాలను రూపొందిస్తున్నారు. అమెరికా, రష్యా, భారత్, చైనా సహా అనేక దేశాలు హైపర్ సోనిక్ సాంకేతికతను చురుగ్గా అనుసరిస్తున్నాయి. హైపర్ సోనిక్ వాహనాలకు స్క్రాంజెట్లు కీలకమైనవి. అవి గాలి నుంచి ఆక్సిజనును ఉపయోగించి ఇంధనాన్ని మండిస్తాయి (ఎయిర్ బ్రీతింగ్ ఇంజిన్లు). ధ్వనివేగాన్ని మించిన వేగంతో ఉన్న సమయాల్లో ఎటువంటి కదిలే భాగాలనూ ఉపయోగించకుండా దహనానికి అంతరాయం కలగకుండా నిలపగల సమర్థత వీటికి ఉంది.హైపర్ సోనిక్ వాహనాల్లో మండించడానికి, అంతరాయం కలగకుండా ఇంధన దహనాన్ని కొనసాగించడానికి ఉపయోగపడడంలో స్క్రాంజెట్ దాహక సామర్థ్యాన్ని ఈ ప్రయోగాత్మక పరీక్ష విజయవంతంగా చాటింది. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌లో జ్వలన ప్రక్రియ 'తుఫానులో కొవ్వొత్తిని వెలిగించడం' వంటిది. స్క్రామ్‌జెట్ దాహకంలో ఒక వినూత్న జ్వాల స్థిరీకరణ సాంకేతికతను పొందుపరిచారు. ఇది సెకనుకు 1.5 కిలోమీటర్ల వాయు వేగం వద్దా దాహకం లోపల జ్వాలను నిలిపి ఉంచుతుంది. స్క్రాంజెట్ ఇంధన దాహక కాన్ఫిగరేషన్ ను రూపొందించడం కోసం అనేక ప్రయోగాత్మక పరీక్షల ద్వారా అనేక అధునాతన దహన - జ్వాలను నిలిపి ఉంచే పద్ధతులను అధ్యయనం చేశారు. అధునాతన కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఎఫ్ డీ) సాధనాలను ఉపయోగించి వాటి పనితీరును మదించి, అంచనావేశారు.డీఆర్డీఎల్, పరిశ్రమ కలిసి ఉష్ణగ్రాహక స్క్రాంజెట్ ఇంధనాన్ని తొలిసారి దేశీయంగా అభివృద్ధి చేయడమే ఈ పురోగతికి మూలం. శీతలీకరణను గణనీయంగా మెరుగుపరచడంతోపాటు జ్వలన సౌలభ్యాన్నీ అందించడం ద్వారా ఇంధనం వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. పారిశ్రామిక స్థాయిలో డీఆర్డీఎల్ భారీ ఇంధన అవసరాలను నెరవేర్చడానికి ఈ బృందం ఒక ప్రత్యేక తయారీ ప్రక్రియను అభివృద్ధి చేసింది.

అత్యాధునిక ఉష్ణ రోధక లేపన (థర్మల్ బ్యారియర్ కోటింగ్ - టీబీసీ) సాంకేతికతను అభివృద్ధి చేయడం మరో కీలక విజయం. ధ్వనివేగాన్ని మించిన వేగంతో ఎగురుతున్న సమయంలో ఎదురయ్యే అత్యధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఎక్కువ ఉష్ణ నిరోధకతతోపాటు ఉక్కు ద్రవీభవన స్థాయిని దాటి కూడా పనిచేసే సామర్థ్యం గల ఒక అధునాతన సిరామిక్ టీబీసీని డీఆర్డీఎల్, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రయోగశాల సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ప్రత్యేక నిక్షేపణ పద్ధతులను ఉపయోగించి స్క్రామ్‌జెట్ ఇంజిన్ లోపల ఈ పూతను వేస్తారు. ఇది వాటి పనితీరును మెరుగుపరచడమే కాకుండా, ఎక్కువ కాలం మన్నేలా చేస్తుంది. దహన ప్రక్రియ కొనసాగింపు, మెరుగైన పనితీరు, అత్యాధునిక ఉష్ణ నిర్వహణల్లో సామర్థ్యాలను చాటిన ఈ పురోగతి తదుపరి తరం హైపర్ సోనిక్ క్షిపణులకు వేదికవుతుంది.



# బెల్జియం విదేశాంగ శాఖ మంత్రి, పరిశ్రమ ప్రముఖులతో భారత్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 23:బెల్జియం విదేశీ వ్యవహారాలు, యూరోపియన్ వ్యవహారాలు, విదేశీ వ్యాపార శాఖ మంత్రి శ్రీ బెర్నార్డ్ క్వింటిన్‌తో భారత్ వాణిజ్య, పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు బ్రస్సెల్స్‌లో సమావేశమయ్యారు. వారిద్దరూ ద్వైపాక్షిక వ్యాపారం, పెట్టుబడి అంశాలపై చర్చించారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన, స్వతంత్ర న్యాయవ్యవస్థల ఉమ్మడి విలువలే పునాదిగా భారత్, బెల్జియంల మధ్య చాలా కాలంగా కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలకు ఈ సమావేశం మరింత బలాన్నిచ్చింది. ఆర్థిక సహకారాన్ని విస్తరింపచేసుకోవడానికి అనుసరించాల్సిన పద్ధతులపై నేతలిద్దరూ చర్చించడంతోపాటు రెండు దేశాల భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఇంకా ఏయే కొత్త మార్గాల్లో పయనించవచ్చో పరిశీలించారు. ఇండియా, బెల్జియంల మధ్య 2023-2024లో 15.07 బిలియన్ (1507 కోట్ల) డాలర్ల పైచిలుకు వ్యాపారం సాగిందని, బెల్జియం నుంచి 3.94 బిలియన్ (394 కోట్ల) డాలర్లకు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారత్‌లోకి వచ్చాయని ఒక అంచనా ఉంది.

విదేశీ వ్యాపారంపై బెల్జియం గణనీయంగా ఆధారపడుతోందని, భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, అవకాశాలను సద్వినియోగపరుచుకోవడంలో రెండు దేశాలకు ఈ అంశాలు బాగా తోడ్పడగలుగుతాయని ఇద్దరు నేతలు చర్చల సందర్భంగా గుర్తించారు. ద్వైపాక్షిక భాగస్వామ్యంలో వ్యాపారావకాశాలు ఒక ముఖ్యపాత్రను పోషించగలవని వారు అభిప్రాయపడుతూ, స్థిర వృద్ధిబాటలో మరింత ముందుకు సాగిపోవడానికి వ్యాపార సంబంధాల్ని భిన్న రంగాల్లోకి విస్తరించాలని, అలాగే ఆర్థిక దౌత్యాన్ని ఇప్పటికన్నా పటిష్టంగా తీర్చిదిద్దాలన్న అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు.

ఈయూ-ఇండియా స్వేచ్ఛా వ్యాపార ఒప్పందం (ఎఫ్‌టీఏ) సంప్రదింపుల్లో పురోగతి అంశంపై కూడా నేతలు చర్చించారు. సంప్రదింపుల్ని సముచిత రీతిలో కొనసాగించడానికి వ్యాపారపరమైన అంశాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని, ఆర్థిక సంబంధాలను బలపరుచుకోవాలని వారు స్పష్టంచేశారు.

పునరుత్పాదక ఇంధనం, లైఫ్ సైన్సెస్, మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ టెక్నాలజీలు, ఆహార ఉత్పత్తుల వంటి రంగాల్లో సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయని అంగీకరించారు.

బెల్జియం తన వ్యాపార సంబంధాలను విస్తరించుకోవడానికి, భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామిగా జతపడడానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాల్సి ఉందని గుర్తించింది. నియంత్రణపరమైన అడ్డంకుల్ని, ముఖ్యంగా ఫార్మస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తులకు ఆమోదం తెలిపే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని గురించి కూడా చర్చించారు. ఈ సవాళ్లను పరిష్కరించడానికి ఆయా అంశాలపై సంప్రదింపులను నిరంతరాయంగా కొనసాగించడానికి ఉభయ పక్షాలు అంగీకరించాయి.

వ్యాపార సమస్యల్ని పరిష్కరించడానికి సమర్థ యంత్రాంగాలను ఏర్పాటు చేసుకోవాలనే నిబద్ధతను చాటుతూ ఈ సమావేశాన్ని ముగించారు. దృఢమైన, ఇరు పక్షాలకూ ప్రయోజనకరంగా ఉండే వ్యాపార బాంధవ్యాన్ని పెంపొందింపచేసుకోవాలని ఆ దిశగా అంకితభావంతో పనిచేస్తామని నేతలిద్దరూ ఉద్ఘాటించారు.

భారత్-బెల్జియం వ్యాపార సంబంధాలు పురోగమించడానికి, ఆర్థిక వృద్ధితోపాటు స్థిరాభివృద్ధి సాధనకు ఉమ్మడి దక్పథాన్ని అనుసరించే దిశలో ఓ ముఖ్యమైన ముందడుగు పడిందని ఈ ఉన్నత స్థాయి సమావేశం సూచిస్తోంది.

వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ యూరోపునకు చెందిన వ్యాపార ప్రముఖులు, వజ్రాల పరిశ్రమ ప్రతినిధులు, సముద్ర సంబంధిత సేవలు, సౌర ఇంధనం, స్వచ్ఛ సాంకేతికత, వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ హైడ్రోజన్ రంగాలకు చెందిన పెట్టుబడిదారులతో కూడా భేటీ అయ్యి వారితో చర్చించారు.

# పవన్ కల్యాణ్ తో సింగపూర్ కాన్సుల్ జనరల్ భేటి



అమరావతి,జనవరి 23: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ సింగపూర్ దౌత్యాధికారులతో సమావేశమయ్యారు. సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గార్ పాంగ్, సింగపూర్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్ విజయవాడలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. పవన్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, ప్రజల సహకార, సంయుక్త అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

ఈ భేటీపై సింగపూర్ దౌత్య కార్యాలయం కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. విజయవాడలో ఘనమైన ఆతిథ్యం ఇచ్చినందుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పేర్కొంది. సింగపూర్-ఆంధ్రప్రదేశ్ మధ్య సుదీర్ఘ మైత్రి ఉందని వెల్లడించింది. ఏపీ-సింగపూర్ సంబంధాల బలోపేతం దిశగా ఈ సమావేశం జరగడం అభినందనీయమని సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గార్ పాంగ్ పేర్కొన్నారు.

# వచ్చే నెల 6న కేబినెట్ భేటీ !



అమరావతి, జనవరి 23:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఫిబ్రవరి 6వ తేదీన ఏపీ మంత్రివర్గం సమావేశం కానుంది. ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరుగుతుందని సీఎస్ కార్యాలయం సర్క్యులర్ జారీ చేసింది. ప్రతిపాదిత అంశాలను ఫిబ్రవరి 4 సాయంత్రంలోగా కేబినెట్ ఆమోదానికి పంపాలని వివిధ ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

# జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుదాం.. కలెక్టర్ డా.లక్ష్మీశ

అమరావతి, జనవరి 23:ఎన్‌టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడ రూరల్ పరిధిలోని ఎనికేపాడులో జరిగిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన జనజాగృతి ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా స్థానిక నివాసి ఆర్.వీరరాఘవయ్య 15రోజుల కింద ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెల్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై అధిక రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని.. ఈ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పథకాన్ని జిల్లాలో పెద్దఎత్తున అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు.



దాదాపు 20ఏళ్ల పాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందొచ్చని వివరించారు. 3కేవీ వ్యవస్థ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని.. మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందొచ్చని, ఈ విధంగా గత రెండు నెలల్లో లబ్ధిదారులకు రూ.33లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు.పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని.. ఇప్పటి వరకు దాదాపు 60వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు కూడా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేయించు కుంటున్నారన్నారు. సౌర శక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందొచ్చని.. పథకం అమల్లో జిల్లాను నెం.1గా నిలపడంలో, పునరుత్పాదక ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నోడల్ అధికారి ఎం.భాస్కర్, సర్పంచ్ ఆర్.పూర్ణచంద్రరావు, వైస్ సర్పంచ్ టీవీవీఎస్ ప్రసాద్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతు దీక్షలో కేటీఆర్‌ను నిలదీయండి - మంత్రి తుమ్మల



యాద్రాద్రి భువనగిరి, జనవరి 23:: బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసమైందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి బీఆర్ఎస్ నెట్టిందని, రైతు దీక్షలో కేటీఆర్‌ను నిలదీయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు ను తాకట్టు పెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని చెప్పారు. పదేళ్లగా రేషన్ కార్డులు ఇవ్వలేని ప్రభుత్వం బీఆర్ఎస్ అని, ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ నిర్వహిస్తున్న గ్రామ సభలకు అడ్డుతగులుతుందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. నల్గొండ లో జరిగే రైతు దీక్ష లో పదేళ్లలో రుణమాఫీ ఎందుకు చేయలేదో అని నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఎందుకు రైతు దీక్ష చేస్తారో చెప్పాలి

నల్లగొండ లో కేటీఆర్ ఎందుకు రైతు దీక్ష చేస్తారో చెప్పాలని రైతులకు రుణమాఫీ , రైతుల భరోసా , సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చినందుకా అని తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. రేషన్ లో దొడ్డు బియ్యం మాఫియా ఉంది కాబట్టి ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నామని, విద్యార్థులకు హాస్టల్ లో సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని చెప్పారు. చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ పబ్బం గడుపుతోందన్నారు. జనవరి 26 నుంచి రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని, దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారని చెప్పారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ రేఖా బాబురావ్, మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తంగళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ జన్మదిన వేడుకలు.. తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

గుంటూరు, జనవరి 23:మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల సందర్భంగా గుంటూరు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పై దాడికి యత్నం జరిగింది. నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముందస్తు సమాచారం లేకుండా ఎమ్మెల్యే వచ్చాడని ఓవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అక్కడికి వెళ్లారు. సమాచారం లేకుండా అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యేపై ఓవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఇరువర్గాలు బాహాబాహికి తలపడ్డారు. ఎమ్మెల్యే పై ఓవర్గం దాడికి ప్రయత్నించడంతో సెక్యూరిటీ అడ్డుకున్నారు. ఈ సంఘటనలో నజీర్ అహ్మద్ కు స్వల్ప గాయాలు కావడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సంఘటనతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఒక్కసారిగా తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# పోక్సో కేసు .. దోషికి 20 ఏళ్ళు జైలు శిక్ష




కర్నూలు, జనవరి 23: మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో దోషికి కర్నూలు జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టు తీర్పు 20 ఏళ్ల జైలు శిక్ష , రూ.10 వేలు జరిమానా విధించింది.. కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా, గోనెగండ్ల మండలం , గంజ హల్లి గ్రామంకు చెందిన జెసిబి కి డ్రైవర్ గా దర్గా షేక్షావలి పని చేస్తున్నాడు . అతడు కర్నూలు , మహావీర్ నగర్ లో ఉంటున్న మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడు. మైనర్ బాలిక తల్లి జి. శాంత 2021సంవత్సరం, ఆగస్ట్ 12వ తేదిన కర్నూలు మహిళా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోక్సో యాక్ట్ కింద నిందుతుడిపై అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వెంకటరామయ్య దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు.

అన్ని కోణాల్లో విచారించిన కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి నిందితుడిని దోషిగా తేల్చి కి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితు రాలికి ప్రభుత్వం తరపున రూ. 2 లక్షల నష్ట పరిహారం ఇవ్వవలసిందిగా ఆదేశించారు..

ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన స్పెషల్ పి.పిలు వెంకటేశ్వరెడ్డి , ప్రకాష్ రెడ్డి, దర్యాప్తు అధికారి మహిళా పియస్ డిఎస్పీ వెంకటరామయ్య , మహిళా పియస్ కోర్టు కానిస్టేబుల్స్ మధుశంకర్, గోపి లను కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని పేర్కొన్నారు.

# ప్రయాగరాజ్‌లో 'హమారా సంవిధాన్ హమారా స్వాభిమాన్'

న్యూఢిల్లీ, జనవరి 23:భారత రాజ్యాంగం, ప్రజల చట్టబద్ధమైన హక్కులపై అవగాహన పెంచే దిశగా న్యాయశాఖ కీలక చర్యలు తీసుకుంది. సంవత్సరం పాటు దేశవ్యాప్తంగా 'హమారా సంవిధాన్ హమారా సమ్మాన్ (హెచ్‌ఎస్2)' ప్రచారం విజయవంతంగా సాగిన సందర్భంగా ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళా వద్ద శుక్రవారం ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

గౌరవనీయ భారత ఉపరాష్ట్రపతి గతేడాది జనవరి 24న ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో 'హమారా సంవిధాన్ హమారా సమ్మాన్' ప్రచారాన్ని ప్రారంభించారు. 2047 నాటికి వికసిత భారత్ దార్శనికతను సాధించడంలో ప్రతి పౌరుడూ క్రియాశీల భాగస్వామి కావాలని ఇది పిలుపునిస్తోంది. గణతంత్రంగా భారత్ 75 ఏళ్లు పూర్తిచేసుకోవడం, రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారు. మై గవ్ వేదికగా 1.3 లక్షల మంది ఉత్సాహంగా పంచప్రాణ ప్రతిజ్ఞను స్వీకరించారు. దేశ నిర్మాణంపట్ల వారి నిబద్ధతకు ఇది నిదర్శనం. గ్రామ విధి చేతన కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ విద్యా సంస్థల విద్యార్థులు దత్త గ్రామాల్లో న్యాయపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దాంతో దాదాపు 21,000 మందికిపైగా లబ్ధిదారులను చేరుకోవడం ద్వారా క్షేత్రస్థాయి భాగస్వామ్యం సాధ్యపడింది. దీనికితోడు దూరదర్శన్, ఇగ్నో భాగస్వామ్యంతో న్యాయశాఖ నిర్వహించిన ప్రభావవంతమైన వెబినార్ల ద్వారా నారీ భాగీదారి, వంచిత వర్గ సమ్మాన్ కార్యక్రమాల్లో 70 లక్షలకు పైగా ప్రజలు భాగస్వాములయ్యారు. చట్టపరమైన, సామాజిక అంశాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ఇది పెంపొందిస్తుంది. 'నవభారత్ నవ సంకల్ప్' ద్వారా యువతలో స్ఫూర్తిని నింపేలా వివిధ ముఖాముఖీ పోటీలు నిర్వహించారు. ఇది వారి క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతోపాటు మెరుగైన భవిష్యత్తు దిశగా వారి బాధ్యతా భావాన్ని పెంపొందిస్తుంది.

భారత్ లోని వివిధ భాగాలను చేరుస్తూ ఏడాది పొడగునా ఈ కార్యక్రమం కొనసాగింది. బికనీర్ (రాజస్థాన్), ప్రయాగరాజ్ (ఉత్తరప్రదేశ్), గౌహతి (అస్సాం) ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు 5,000 మందికి పైగా పౌరులు వ్యక్తిగతంగా హాజరుకాగా.. వీటిలో భాగంగా నిర్వహించిన సబ్ కో న్యాయ హర్ ఘర్ న్యాయ, నవ భారత్ నవ సంకల్ప్, విధి జాగృతి అభియాన్ వంటి ప్రచారాల్లో 8 లక్షల మందికి పైగా పౌరులు క్రియాశీలకంగా భాగస్వాములయ్యారు.

ప్రస్తుత కార్యక్రమం ప్రయాగరాజ్ లోని అరైల్ ఘాట్ లో ఉన్న పరమార్థ త్రివేణి పుష్ప్ లో జరగనుంది. కార్యక్రమ విజయాన్ని, అది సాధించిన పురోగతిని చాటేలా పలు కీలక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రపంచంలో అతిపెద్ద, ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఒకటి.. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమంలో స్నానాల కోసం లక్షలాది మంది ఒక్కచోటికి చేరే మహా కుంభమేళా జరుగుతున్న వేళ సంగమ నగరి ప్రయాగరాజ్ లో ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రయాగరాజ్ లో ఈ చారిత్రక ఆధ్యాత్మిక ఉత్సవం జరుగుతున్న సమయంలోనే హెచ్ఎస్2 ప్రచార ముగింపు కార్యక్రమమూ నిర్వహిస్తుండడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భారత సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం - ఆధ్యాత్మిక సంప్రదాయాలూ రాజ్యాంగ విలువల సమ్మేళనాన్ని ఇది సూచిస్తుంది. విజయాలను వివరించే బుక్ లెట్ విడుదల: గౌరవనీయ న్యాయ శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి దీనిని విడుదల చేస్తారు. ప్రారంభం, ప్రాంతీయ కార్యక్రమాలు, పోటీలు, ఏడాది పొడవునా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు సహా 'హమారా సంవిధాన్ హమారా సమ్మాన్' ప్రస్థానాన్ని ఇందులో వివరించారు. న్యాయశాఖ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ: ఈ ప్రచార ప్రాతిపదికలను, కార్యక్రమాలను ప్రతిబింబించేలా రూపొందించిన 2025 క్యాలెండరును కూడా ప్రారంభిస్తారు. హెచ్ఎస్2 ప్రచారంపై సినిమా విడుదల: హెచ్ఎస్2 ప్రచార ఏడాది ప్రస్థానాన్ని ప్రదర్శించేలా.. కార్యక్రమ ఆశయాన్ని ఆడియో- విజువల్స్ ద్వారా సంగ్రహంగా చిత్రించిన సినిమాను విడుదల చేస్తారు.

భారత రాజ్యాంగం, దాని చరిత్ర, ప్రస్తుత ప్రపంచంలో దాని ఔచిత్యంపై అవగాహన కల్పించడంలో 'హమారా సంవిధాన్ హమారా సమ్మాన్' ప్రచారం ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని ఘనంగా ముగించడానికి, 'హమారా సంవిధాన్ హమారా స్వాభిమాన్'ను ప్రారంభించడానికి ప్రయాగరాజ్ లో జరిగే కార్యక్రమం వేదికవుతుంది. దేశవ్యాప్తంగా పౌరులను భాగస్వాములను చేయడంలో సమష్టి కృషిని ఇది చాటుతుంది.

న్యాయ శాఖ సహాయ (స్వతంత్ర హోదా), పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. పరమార్థ నికేతన్ అధ్యక్షులు - ఆధ్యాత్మికాధినేత పూజ్య స్వామి చిదానంద సరస్వతీ జీ గౌరవ అతిథిగా హాజరవుతారు. విశిష్ట అతిథిగా పరమార్థ నికేతన్ అంతర్జాతీయ డైరెక్టర్ పూజ్య సాధ్వి భగవతీ సరస్వతీ జీ పాల్గొంటారు. న్యాయ విభాగ కార్యదర్శి శ్రీ రాజ్ కుమార్ గోయల్, సంయుక్త కార్యదర్శి శ్రీ నీరజ్ కుమార్ గయాగీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రాంతీయ కార్యక్రమాల్లో భాగంగా ఈ నాలుగో కార్యక్రమాన్ని వైభవంగా సాగుతున్న మహాకుంభమేళా మధ్యలో ప్రయాగరాజ్ అరైల్ ఘాట్ సమీపంలోని పరమార్థ నికేతన్ త్రివేణీ పుష్ప్ వద్ద నిర్వహిస్తున్నారు.


సూతపురాణం శతవసంతాల వేడుక

**కవిరాజు త్రిపురనేని**

జాతీయ పురస్కార సభ



29 జనవరి, 2025 బుధవారం, ఉదయం 10 గం లకు
వేదిక: జే కే సి కళాశాల ఆడిటోరియం, గుంటూరు

సభాధ్యక్షులు : శ్రీ గద్దె మంగయ్య,
గౌరవ అధ్యక్షులు, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.
స్వాగతం: శ్రీ బైరపనేని నరేష్,
పూర్వాధ్యక్షులు, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.

పురస్కారగ్రహీతలు
డా. దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
శ్రీ కొత్తపల్లి రవిబాబు
ప్రధాన సంపాదకులు, ప్రజాసాహితి

పురస్కారప్రదాతలు:
శ్రీ ఆలోకం పెద్దబ్బయ్య, అధ్యక్షులు, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.
శ్రీ జొన్నలగడ్డ రామారావు, పూర్వాధ్యక్షులు, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.
శ్రీ రావెల సాంబశివరావు, ఉపాధ్యక్షులు, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.
శ్రీ వల్లూరు తాండవకృష్ణ, కార్యదర్శి, కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి.

పివి రమణ బృందంచే కవిరాజు గీతాలాపన
సభానంతరం డా.చిట్టినేని లక్ష్మీనారాయణ దర్శకత్వం వహించిన
కవిరాజు విజయం, సాహితీ పద్యరూపక టెలి ఫిలిం ప్రదర్శన

సభానంతరం విందు
కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి.
గుంటూరు


# నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటం నాలక్ష్యం

## -తనకు ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవు: చంద్రబాబు

అమరావతి జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటం తప్ప తనకు ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని తెలియజేశారు. దావోస్ సదస్సులో చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలు తన మీద నమ్మకంతో, ఎన్డీఏ మీద నమ్మకంతో పునర్నిర్మాణం చేయమని కూటమిని గెలిపించారన్నారు. రాష్ట్రాన్ని రీ బిల్డ్ చేసి, అభివృద్ధి పథంలో నడిపిస్తానని, స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 విజన్ ని సాధించటమే తన లక్ష్యమని బాబు స్పష్టం చేశారు. దావోస్ సదస్సులో ఎల్జీ కెమ్ లిమిటెడ్ సీఈవో షిన్ హక్ చియోల్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశ మయ్యారు. 1.5 బిలియన్ లిథియం -అయాన్ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటు యోచనలో వున్న ఎల్జీ కెమ్ అనుబంధ సంస్థ ఎనర్జీని రాష్ట్రంలో నెలకొల్పాల్సిందిగా కోరారు. అలాగే తిరుపతిలో సెమీకండక్టర్ యూనిట్, మూలపేట, విశాఖలో పెట్రో కెమికల్ యూనిట్లను కూడా నెలకొల్పుకునే అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

# దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు పోసుకుంటున్నారు

## - బీఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు

సిద్దిపేట జనవరి 23(ఎక్స్ ప్రెస్ న్యూస్);: దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు? ప్రజల డబ్బులు ఎందుకు వృధా చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి? దరఖాస్తు పెట్టిన ప్రతిసారి 30, 40 రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం, మీ సేవలో అప్లికేషన్ పెట్టాం, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నామని ప్రజలు అంటున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ దరఖాస్తులు కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డ్ లో నిర్వహించిన గ్రామ సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నం పెడుతామన్నారని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని హరీష్ రావు నిలదీశారు.రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎగవేతల సిఎం రేవంత్ రెడ్డి, కోతల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతలు అని చురకలంటించారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే యాసంగి వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయిందని ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సి, ఎస్టిలకు ఇల్లు కట్టుకునేందుకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోటిమంది కూలీలు ఉంటే కోతలు పెట్టి ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల రూపాయలు బాకీ పడిందని, 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు.

# బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మరో షాక్

**-రూ.19 కోట్ల బకాయి గడువులోగా చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని ఎస్బిఐ నోటీసులు**

నిజామాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మరో షాక్ తగలింది. అప్పు చెల్లించాలని షకీల్ కు బ్యాంక్ నోటీసులు ఇచ్చింది.

తీసుకున్న రుణం సకాలంలో చెల్లించలేదని ఎస్బిఐ నోటీసులు జారీ చేసింది. రూ.19 కోట్ల బకాయి గడువులోగా చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని ప్రకటించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నోటీసులపై ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే షకీల్ కానీ ఆయన అనుచరులు కానీ స్పందించలేదు. మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ ప్రజాభవన్ వద్ద మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టడంతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రెండు సంవత్సరాల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో షకీల్ కారు ఢీకొనడంతో ఒక చిన్నారి దుర్మరణం చెందిన విషయం విధితమే. ఇప్పటికే ఈ రెండు కేసులతో షకీల్ సతమతమవుతున్నారు.

# బాల్ ఠాక్రే ,నేతాజీ సుభాష్ చంద్రబోస్ లకు భారతరత్న ప్రకటించాలి

**- శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రాధనా కార్యదర్శి సుదర్శన్ డిమాండ్**




కాచిగూడ దగ్గర ఈ రోజు జనవరి 23: హిందూ సామ్రాట్ శ్రీ బాల్ ఠాక్రే 99 వ జయంతి మరియు భారత్ దేశ ముద్దుబిడ్డ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి పురస్కరిన్చికొని గురువారం శివసేన తెలంగాణ పార్టీ ఆద్వర్యం లో ఇరువురికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివసేన తెలం గాణ రాష్ట్ర ప్రాధనా కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ ఒకరేమో దేశం కోసం ధర్మం కోసం మరొకరు దేశం దేశ రక్షణ కోసం ఎవరి శ్వాస వరకు భారతదేశానికి సేవలందించిన మహాను భావులు హిందూ సామ్రాట్ శ్రీ బాల్ ఠాక్రే, నేతాజీ సుభాష్ చంద్రబోస్ లని కొనియాడారు. బాల సాహెబ్ ఠాక్రే , నేతాజీ సుభాష్ చంద్రబోస్ ల జయంతి సందర్భంగా హిందు బంధువులం దరికీ మరియు భారతీయులందరికీ పేరుపేరునా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వెంకటేష్ బతిరాజ్ గౌట్ గణేష్ తెలంగాణ అధికార ప్రతినిధిపూస శ్రీనివాస్ అవినాష్ సుదర్శన్ కిరణ్ నందు భారత్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం- కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, జనవరి 23:: కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు బత్తుల అంజి అన్నారు. ములకలపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామ పంచాయతీలో గురువారం ప్రజాపాలన గ్రామ సభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరుగుతుందన్నారు.

ములకలపల్లి రైతు వేదిక కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో వారు పాల్గొని గ్రామ ప్రజలతో, లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు.

అధికారులు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరపాలన్నారు. జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులు ఎంతమంది ఉన్నా వారి పేర్లను చేర్చేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తప్పకుండా ప్రతి ఒక్క లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఈ సభలో నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం..

**-సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయ దంపతుల క్షీరాభిషేకం**

**-834 స్పౌజ్ బదిలీల పట్ల ఉపాధ్యాయుల హర్షం**




నిజామాబాద్, జనవరి 23:స్పౌజ్ బదిలీలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 2021లో వెలువడిన 317 జీవో ద్వారా ఉపాధ్యాయ దంపతులను వేర్వేరు జిల్లాకు బదిలీలయ్యారు. గత మూడు సంవత్సరాలుగా భార్య ఒక జిల్లాలో, భర్త ఒక జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఎంతో ఆవేదనకు, మానసికంగా ఆందోళనకు గురయ్యారు. గత ప్రభుత్వంలో అనేక ఆందోళనలు జరిపినప్పటికీ ఆ ప్రభుత్వం ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోయింది.

నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి మంత్రుల సబ్ కమిటీని ఏర్పాటు చేసి ఆ సబ్ కమిటీ రిపోర్ట్ ఆధారంగా జీవో నెంబర్ 243 ద్వారా విడిపోయిన భార్యభర్తలను ఒక దగ్గరకు చేర్చింది. దీనిలో భాగంగానే పాఠశాల విద్యా శాఖలో 834 స్పౌజ్ బదిలీలను చేపట్టింది. నిజామాబాద్ జిల్లాకు 57మంది ఉపాధ్యాయులు స్పౌజ్ బదిలీల ద్వారా రావడం జరిగింది. ఈ స్పౌజ్ బదిలీల ద్వారా తమ కుటుంబాలను కలిపిన సీఎం రేవంత్ రెడ్డికి, 317- మంత్రుల సబ్ కమిటీ చైర్మన్ దామోదర్ రాజనర్సింహకి, సబ్ కమిటీ సభ్యులు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబుకి, ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టిన నేపథ్యంలో గురువారం నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఉపా ధ్యాయులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ మేలుకి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వివిధ కారణాలతో మిగిలినటు వంటి అప్ గ్రేడేషన్ అయిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మిగిలిన స్కూల్ అసిస్టెంట్లు, ఇంటర్ డిస్ట్రిక్ట్ అండ్ సెంట్రల్ స్పౌజ్ లాంటి వారి విషయంలో కూడా మానవతా దృక్పథంతో సానుకూల నిర్ణయం తీసుకొని దయచేసి సాధ్యమైనంత తొందరగా వారిని కూడా బదిలీ చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పౌజ్ ఫోరం కోకన్వీనర్ సోమయ్యగారి నరేష్, బాలరాజు, రాజు, సుమన్, సుధాకర్ రాజేశ్వరి, సౌజన్య భారతి, తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లోని ఒక ప్రభుత్వ సంస్థలో తొలిసారిగా హార్ట్‌మేట్ 3 సాయంతో లెఫ్ట్ వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైజ్‌ను అమర్చిన ఆర్మీ ఆసుపత్రి

న్యూఢిల్లీ, జనవరి 23:ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఆర్మీ ఆసుపత్రి... అది కూడా భారత్‌లోని ఒక ప్రభుత్వ సంస్థలో తొలిసారిగా హార్ట్‌మేట్ 3 పరికరం సాయంతో లెఫ్ట్ వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైజ్ (ఎల్‌వీఏడీ)ను అమర్చింది. సాయుధ బలగాలు అందించే వైద్య సేవల్లో సైతం ఇదే మొదటిది, చరిత్రాత్మకమైనది. రెండేళ్లకు పైగా గుండె మార్పిడి చికిత్స కోసం ఎదురు చూస్తున్న 49 ఏళ్ల మహిళకు విజయవంతంగా ఈ పరికరాన్ని అమర్చారు. ఆమె సాయుధ బలగాలకు చెందిన సైనికుని భార్య. ఈ ఎల్‌వీఏడీని తరచుగా 'మెకానికల్ హార్ట్'గా పరిగణిస్తారు. చివరి దశ గుండె వైఫల్యంతో బాధపడుతున్న రోగులను రక్షించే కవచంగా పనిచేస్తుంది.

అధునాతన సాంకేతికతను ఉపయోగించి గుండె పనితీరును మెరుగుపరిచే అత్యాధునిక పరికరమే ఈ హార్ట్‌మేట్3 ఎల్‌వీఏడీ. ఇది తీవ్రమైన హృద్రోగ సమస్యలు ఎదురైనప్పుడు రోగుల్లో ఆశాభావాన్ని నింపుతుంది. ప్రస్తుతం వైద్య పర్యవేక్షణలో ఉన్న రోగి క్రమంగా కోలుకుంటున్నారు. ఇది అత్యంత నైపుణ్యంతో కూడిన వైద్యబృందం సాధించిన విజయాన్ని సూచిస్తుంది.

ఆర్మీ ఆసుపత్రి చిత్తశుద్ధితో అందించే అత్యుత్తమ వైద్యసేవలను ఈ విజయం సూచిస్తుంది. కీలక విజయంగా పరిగణించదగిన ఈ చికిత్స అధునాతన వైద్య సేవలు అందించడంలో ఆర్మీ ఆసుపత్రి (ఆర్ అండ్ ఆర్)ని అగ్రగామిగా నిలబెడుతుంది.

# నేతాజీ జయంతిని బానిసత్వ విముక్తి దినంగా ప్రకటించాలి

**-బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్.**

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); భారతదేశ దేశ ఆత్మగౌరవ ప్రతీక ,తన అద్భుతమైన మేధాశక్తి, తెగింపుతో జైల్లలో మగ్గుతున్న ఖైదీలను, నిరాశ్రయులను, బాధితులను,అభాగ్యులను సైనిక శక్తిగా మలచి ఆజాద్ హింద్ ఫౌజ్ నెలకొల్పి బ్రిటిష్ సైనిక మూకలను గడగడ లాడించిన స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినమయిన జనవరి 23 ను,బానిసత్వ విముక్తి దినంగా ప్రకటించాలని,సిసలైన దేశభక్తుడు సుభాష్ చంద్రబోస్ కు భారతరత్న ప్రకటించాలని బీసీ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షులు దాస సురేష్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లి లో బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాల యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా అట్టడుగు వర్గాలు బలహీనవర్గాల పట్ల ఆధిపత్య వర్గాల వివక్ష నేటికీ కొనసాగుతూనే ఉందని మండిపడ్డారు. ఆర్థిక రాజకీయ బానిసత్వంలో మగ్గుతున్న బీసీ బహుజన వర్గాలను,బానిసత్వం నుండి విముక్తి చేయటానికి క్షేత్రస్థాయి నాయకత్వ నిర్మాణాన్ని బీసీ రాజ్యాధికార సమితి ఇప్పటికే అన్ని జిల్లాలలో, నియోజకవర్గాలలో, జిల్లాలలో, మండలాలలో,గ్రామాలలో కొనసాగిస్తున్నదన్నారు. సబ్బండ వర్గాలకు సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని అందించేంతవరకు విశ్రమించేది లేదన్నారు. నేతాజీ చూపిన బాటలో ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, భారత దేశం ప్రపంచంలో కెల్లా అత్యంత బలమైన దేశంగా రూపొందించే వరకు అలుపెరుగకుండా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ ప్రయాణంలో మహిళలకు, యువకులకు, నాయకత్వ నిర్మాణంలో అవసరమైన తర్ఫీదు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ప్యారసాని దుర్గేష్, భారత మురళి, మడత కిషోర్, స్వప్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలు: మహాకుంభ్ 2025లో ప్రధాన భూమిక పోషిస్తున్న అఖాడాలు

న్యూఢిల్లీ, జనవరి 23:సుదీర్ఘ కాలంగా మహా కుంభ్‌కు ప్రధాన కేంద్రంగా వ్యవహరిస్తూ సనాతన ధర్మంలోని వివిధ సంప్రదాయాలకు, వర్గాలకు అఖాడాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. 'అఖాడా' అనే పదం 'అఖండ' నుంచి పుట్టింది... అవిభాజ్యమైనదని అర్థం. ఆరో శతాబ్దంనాటి ఆది గురు శంకరాచార్యుని కాలం నాటి ఈ ధార్మిక సంస్థలు, కుంభమేళాను తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక పద్ధతులు, పూజా కార్యక్రమాలకు సంరక్షకులుగా వ్యవహరిస్తున్నాయి. ప్రత్యేకమైన ఆచారాలు, నాయకత్వ వ్యవస్థలతో కూడిన ఈ అఖాడాలు మేళాకు సంబంధించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవనంలో కీలకమైన పాత్ర పోషిస్తూ, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తున్నాయి.

కుంభమేళాలో అఖాడాలు ప్రార్థనా స్థలాలుగా మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక సాధన, శారీరక శిక్షణ కేంద్రాలుగా కూడా పని చేస్తాయి. గ్రంథాల ద్వారా ఆధ్యాత్మిక సాధన, యుద్ధ విద్యల ద్వారా భౌతిక రక్షణ అనే రెండు అంశాలను ప్రోత్సహించేందుకు ఈ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ అఖాడాలు కాలానుగుణంగా మార్పులు సంతరించుకుంటూనే ఈ విలువలను సైతం పాటిస్తున్నాయి. అఖాడాలకు నాయకత్వం వహించే మహామండలేశ్వరులు ఆధ్యాత్మిక, సంస్థాగత అంశాల నిర్వహణ సజావుగా ఉండడంలో కీలకంగా వ్యవహరిస్తారు. కుంభ్ అనుభవాన్ని నిర్వచించే ఆచారాలు, ఊరేగింపుల నిర్వహణలో వారి నాయకత్వమే ప్రధానం.

13 అఖాడాల్లోని శైవ, వైష్ణవ, ఉదాసీన విభాగాలు వాటి దృఢమైన ఆధ్యాత్మిక తత్వంతో ప్రత్యేకంగా నిలుస్తాయి. వాటికంటూ ప్రత్యేకమైన భక్తి భావన, ఆరాధన, సామాజిక జీవన విధానాలతో ఈ అఖాడాలు కుంభ్‌లో సుసంపన్నమైన వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు శైవ అఖాడాల్లో శివుణ్ని ఆరాధించే నాగ సాధువులు ఆధ్యాత్మికత, యుద్ధ పరాక్రమానికి పేరుగాంచారు. ఈటెలు, కత్తులు వంటి సంప్రదాయ ఆయుధాలను ధరించే ఈ నాగసాధువులు కుంభ్‌లో జరిగే పెద్ద ఊరేగింపులు, ఆచారాలు ముఖ్యంగా సాహిస్నాన్ ఉత్సవాల్లో ప్రధాన భూమిక పోషిస్తారు.

కుంభ మేళాలో పాల్గొనే వారిలో శైవ అఖాడాలకు, ముఖ్యంగా జునా అఖాడాకు చెందిన నాగసాధువులను

అత్యంత గౌరవనీయులుగా పరిగణిస్తారు. తపోసాధన, యుద్ధవిద్యల్లో వారికున్న ప్రావీణ్యానికి పేరుగాంచిన ఈ నాగసాధువులు, కుంభమేళా ఆధ్యాత్మిక యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. పెద్ద సంఖ్యలో నాగసాధువులతో కూడిన జునా అఖాడా కుంభమేళాలో ప్రధాన ధార్మిక సేనగా కొనసాగుతూ, ఆధ్యాత్మిక వికాసం, శారీరక క్రమశిక్షణ రెండింటినీ కోరుకునే భక్తులను ఆకర్షిస్తుంది.

చారిత్రక ప్రాముఖ్యమున్న అఖాడాల్లో ఒకటైన శ్రీ పంచ దశనం ఆవాహన అఖాడా 1,200 ఏళ్లుగా కుంభమేళాలో పాల్గొంటోంది. మహంత్ గోపాల్ గిరి నేతృత్వం వహిస్తున్న ఈ అఖాడా దైవాధికారాన్ని సూచించే పవిత్ర దండాన్ని ఊరేగించే ఛరి యాత్ర సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఆధునిక అవసరాలకు తగినట్లుగా నడుచుకుంటూనే ప్రాచీన పద్ధతులను పరిరక్షిస్తూ కుంభ్‌కు ఈ అఖాడా తనవంతు తోడ్పాటు అందిస్తోంది. సనాతన ధర్మ ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంలో అఖాడాలు నిరంతరం చేసే కృషిని ఇది విశదీకరిస్తుంది.

శ్రీ పంచ నిర్మోహి, శ్రీ పంచ నిర్వాణి, శ్రీ పంచ దిగంబర్ సహా ఇతర వైష్ణవ అఖాడాలు ఈ కుంభమేళాలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ అఖాడాలు.. విష్ణువు, మరో అవతారమైన హనుమంతుడిని ఆరాధిస్తారు. వీరు ఎగరవేసే హనుమంతుని రూపం ముద్రించిన ధర్మ ధ్వజాలు (జెండాలు) భక్తులకు దైవ రక్షణ, ఆశీర్వాదాలు అందిస్తాయి. అలాగే ఉత్సవంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తాయి.

మహాకుంభ ఆధ్యాత్మిక దృశ్యంలో వచ్చిన గణనీయమైన మార్పును సూచిస్తూ మొదటిసారిగా 1,000 మంది మహిళలు వివిధ అఖాడాల్లోకి ప్రవేశిస్తారని అంచనా వేస్తున్నారు. వారిలో సంస్కృతంలో పీహెచ్‌డీ చేస్తున్న రాధేనంద్ భారతి సహా అనేక మంది ఇప్పటికే సన్యాసం స్వీకరించారు. అఖాడాలలో మహిళలను చేర్చుకోవడం ఆధ్యాత్మిక జీవనంలో వారు పోషిస్తున్న పాత్రకు పెరుగుతున్న గుర్తింపును తెలియజేస్తుంది. కొన్ని అఖాడాలు మహిళా సాధువుల కోసం ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నాయి.

ఈ ఉద్యమంలో శ్రీ పంచదశనం జునా అఖాడా కీలకపాత్ర పోషిస్తోంది. కుంభమేళాలో అతి పెద్దది, అత్యంత ప్రభావవంతమైన అఖాడాల్లో ఇది ఒకటి. ఈ అఖాడా 200 మందికి పైగా మహిళలను సన్యాసినులుగా మార్చింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇటీవలే జునా అఖాడా తన మహిళా సాధువుల సంస్థ పేరును సన్యాసిని శ్రీ పంచదశనం జునా అఖాడాగా మార్చి, వారికి ఆధ్యాత్మిక సమాజంలో అధికారిక, గౌరవనీయ గుర్తింపును అందించింది.

లింగ సమానత్వాన్ని అందిపుచ్చుకుంటూ ఈ అఖాడాలు తమ అంతర్గత వ్యవస్థలను పునరుద్ధరించడమే కాకుండా భారత దేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక నిర్మాణంలో చురుగ్గా పాలుపంచుకొనేలా మహిళలను చైతన్యపరుస్తున్నాయి.

అత్యంత సంపన్నమైన, ప్రభావవంతమైన మహా నిర్వాణి అఖాడా లింగ సమానత్వాన్ని సాధించడంలో ముందు వరుసలో ఉంది. మహిళల కోసం మహామండలేశ్వర్ స్థానాన్ని ఏర్పాటు చేసిన మొట్టమొదటి అఖాడాగా ఆధ్యాత్మిక రంగంలో లింగ సమానత్వం కోసం ప్రయత్నిస్తూనే ఉంది. సాధ్వి గీతా భారతి, సంతోష్ పురి లాంటి మహిళా మండలేశ్వరుల భాగస్వామ్యం - ఆధ్యాత్మిక సమాజంలో మహిళలకు సమానావకాశాలు కల్పించాలనే అఖాడాల నిబద్ధతను తెలియజేస్తుంది.

మహా నిర్వాణి అఖాడా లింగ సమానత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని సైతం తెలియజేస్తుంది. ఇది అఖాడాకు ఉన్న సామాజిక, ఆధ్యాత్మిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఈ భావన సుస్థిరతే ప్రధానంగా, ఆచారవ్యవహారాల్లో పర్యావరణ స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో, ఆధ్యాత్మిక ఐక్యతకు వెలుగు రేఖగా కుంభమేళా పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా ఉంది.

కుంభ మేళాలో వచ్చిన ప్రధాన మార్పుల్లో క్రమంగా పెరుగుతున్న కిన్నార అఖాడాల ఉనికి కూడా ఒకటి. సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన ఈ కిన్నార వర్గాన్ని ఆహ్వానించే సంఘటిత ప్రదేశం ఇది. మొట్ట మొదటిసారిగా ఈ కిన్నార అఖాడా మహాకుంభలో పాల్గొంటోంది. ఇది ఈ ఉత్సవానికి, ఈ వర్గానికి మహత్తరమైన ఘట్టంగా నిలిచిపోనుంది. ఈ అఖాడా సమానత్వం, గౌరవం అనే సూత్రాలను తనలో ఇముడ్చుకుని సనాతన ధర్మంలోని ఇతర వర్గాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కిన్నారా సమాజానికి చెందినవారు కూడా పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తుంది.

2025లో జరుగుతున్న ఈ కుంభమేళా భారతీయ ఆధ్యాత్మిక జీవనంలో అఖాడాల ప్రాధాన్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.

ఈ సంస్థలు సనాతన ధర్మ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను పరిరక్షించడమే కాకుండా, ఆధునిక భావాలకు అనుగుణంగా సమ్మిళితం, ఏకత్వం అనే భావనలను స్వీకరిస్తున్నాయి. మహాకుంభ్‌లో అఖాడాలు లక్షల మంది భక్తులకు ఆధ్యాత్మిక వృద్ధి, క్రమశిక్షణ, ఐక్యత అనే మార్గాన్ని చూపిస్తున్నాయి. ఊరేగింపులు జరుగుతున్నప్పుడు, పవిత్ర ఆచారాలు నిర్వహిస్తున్నప్పుడు మహా కుంభ మేళాకు హృదయంగా, ఆత్మగా ఈ అఖాడాలు నిలిచిపోతాయి. దైవత్వంతోపాటు ఇతరులతోనూ గాఢమైన అనుబంధం పెంచుకొనేలా భక్తులకు మార్గనిర్దేశం చేస్తాయి.

# ఎన్నికల నిర్వహణలో శ్రేష్ఠత్వానికిగాను అవార్డులను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 23:పదిహేనో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని (ఎన్‌వీడీ) జనవరి 25న దేశమంతటా నిర్వహించనున్నారు. 2024లో లోక్ సభ ఎన్నికలను చరిత్రాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ వేడుకలు చోటుచేసుకోబోతున్నాయి. ఆ లోక్ సభ ఎన్నికలు ప్రపంచంలో అతి విశాల ప్రజాస్వామిక ప్రక్రియకు నిదర్శనంగా నిలిచాయి. ఎన్నికల సంఘం (ఈసీ) కూడా దేశ ప్రజలకు తాను అంకిత భావంతో అందిస్తున్న సేవలకు 75 సంవత్సరాలైన ఘట్టాన్ని ఓ ఉత్సవంలా నిర్వహించుకోనుంది.

భారత్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 100 కోట్లకు చేరుకొంటున్న తరుణంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పెద్ద పేరు రానుంది. ఓటర్ల డేటాబేస్ ఇప్పుడు 99.1 కోట్ల స్థాయిని అందుకొంది. పౌరుల్లో ఓటు వేయడానికి అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేసుకొంటున్న ప్రక్రియ కొనసాగుతోంది. రోజూ అనేక మంది తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్పించుకుంటున్నారు. దేశంలో ప్రస్తుతం 18 ఏళ్లు మొదలు 29 ఏళ్ల వయసులో ఉన్న యువ ఓటర్ల సంఖ్య 21.7 కోట్లు. ఇది మన దేశ ఓటర్ల జాబితా గొప్పతనాన్ని చాటిచెబుతోంది. 2024లో ఓటర్ల జెండర్ రేషియో 948గా ఉండగా 2025లో ఇప్పటికి ఆరు పాయింట్లు పెరిగి 954కు చేరుకొంది.

న్యూ ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కార్యక్రమంలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కేంద్ర న్యాయ, చట్ట శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ అర్జున్ రాం మేఘ్‌వాల్ ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా రానున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఇతర ప్రముఖులలో ఎన్నికల ప్రధానాధికారి, ఎలక్షన్ కమిషనర్లు కూడా ఉన్నారు.

ఈ కార్యక్రమానికి ఎన్నికల నిర్వహణ సంస్థల అధిపతులు, ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. వారు ప్రపంచంలో ఎన్నికల నిర్వహణలో ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 23, 24లలో జరగనున్న 2 రోజుల సమావేశంలో చర్చిస్తారు.

"ఓటింగుకు సాటివచ్చేది మరేదీ లేదు, నేను తప్పక ఓటు వేస్తాను" అనేది ఈ సంవత్సరం ప్రధాన ఇతివృత్తంగా ఉంది. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అందరూ ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని, ఓటర్లు వారికున్న వోటు హక్కును వినియోగించుకోవడాన్ని గర్వంగా భావించాలని వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో కిందటి సంవత్సరానికి ఎంపిక చేసిన ఇదే ఇతివృత్తాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తున్నారు.

ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి శ్రమించి, ఇతరులకు కూడా మార్గదర్శనం చేసే తరహా పనితీరును కనబర్చిన రాష్ట్ర స్థాయి అధికారులకు, జిల్లా స్థాయిల అధికారులకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డులను గౌరవనీయ రాష్ట్రపతి ఈ కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఎన్నికల్లో వోటు వేసేటట్లు చూడడం, కిందటి సంవత్సరానికి ఎంపిక చేసిన ఇదే ఇతివృత్తాన్ని ఓటర్లలో చైతన్యాన్ని పెంచడం ప్రధానంగా వినూత్న పద్ధతుల్లో ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించడం, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు ఎదురవకుండా చూడడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవడం వంటి వాటిపైనా, అలాగే ఎన్నికల ప్రక్రియను అందరి అందుబాటులోకి తీసుకుపోయేందుకు చేపట్టిన చర్యలపైన ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోనున్నారు.

"ఇండియా ఓట్స్ 2024: ఎ సాగ ఆఫ్ డెమోక్రసి" పేరుతో తీసుకువచ్చిన ఈసీఐ కాఫీ టేబుల్ బుక్ మొదటి కాపీని ఎన్నికల ప్రధానాధికారి శ్రీ రాజీవ్ కుమార్ రాష్ట్రపతికి బహూకరించనున్నారు. ఈ పుస్తకాన్ని 18వ లోక్ సభ ఎన్నికలు విజయవంతం కావడానికి తోడ్పడ్డ ప్రతి ఒక్క ఓటరుకు, ప్రతి ఒక్క ఎన్నికల అధికారికి, భద్రత సిబ్బందికి, ఆసక్తిదారులందరికి ప్రశంసలు తెలియజేస్తూ ప్రచురించారు. ఈ పుస్తకం ఆకట్టుకొనే ఛాయాచిత్రాలు, చదవడం మొదలుపెడితే ఆపకుండా పూర్తి చేయాలనిపించే కథనాలతో 2024లో నిర్వహించిన లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రజాస్వామ్యం చేసిన ప్రయాణాన్ని గురించి పాఠకులకు వివరిస్తుంది.

"ఇండియా డిసైడ్స్" పేరుతో వార్నర్ బ్రాస్ డిస్కవరీ నిర్మించిన డాక్యు-డ్రామా సిరీస్‌లో నుంచి ఒక చిన్న భాగాన్ని కూడా ఇదే కార్యక్రమంలో విడుదల చేయనున్నారు. మూడు భాగాలతో కూడిన ఈ సిరీస్ ప్రపంచంలో అతి భారీ స్థాయి ఎన్నికల చరిత్ర, ఆ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విడమరచి చెబుతుంది. ఈ డాక్యు-డ్రామా సిరీస్‌ను డిస్కవరి చానల్‌లోనూ, దాని ఓటీటీ ప్లాట్‌ఫారాల్లోనూ ప్రదర్శిస్తారు.

''బిలీఫ్ ఇన్ ది బ్యాలట్: హ్యూమన్ స్టోరీస్ షేపింగ్ ఇండియాస్ 2024 ఎలక్షన్స్" పేరుతో ఈసీఐ తీసుకువచ్చిన ఒక పుస్తకాన్ని కూడా రాష్ట్రపతికి ఎన్నికల సంఘం బహూకరించనుంది. ఎన్నికల విశిష్టతను చాటిచెప్పే మానవాసక్తికర కథలతో ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు.

గత సంవత్సరం నిర్వహించిన లోక్ సభ ఎన్నికల ముఖ్య అంశాలను వివరించే ఒక మల్టిమీడియా ఎగ్జిబిషనును కూడా ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన వారు స్వయంగా పాలుపంచుకొని, అనేక విషయాల్ని తెలుసుకోవడానికి అవకాశాన్నిచ్చే స్టాల్స్‌ను సైతం ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నారు.

ఈసీఐని 1950 జనవరి 25న ఏర్పాటు చేశారు. సరిగ్గా అంతకు ఒక రోజు తర్వాత, భారత్ గణతంత్రంగా ఆవిర్భవించింది. కాగా ఈసీఐ ఏర్పాటు దినాన్ని స్మరించుకొంటూ, జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని- 2011 నుంచి- ప్రతి సంవత్సరం జనవరి 25న నిర్వహిస్తూ వస్తున్నారు. ఓటరును కేంద్ర స్థానంలో నిలుపుతూ ఓటరుకున్న ప్రాధాన్యాన్ని వివరించడం, ఎన్నికల పట్ల పౌరులలో చైతన్యాన్ని పెంచడంతోపాటు ప్రజాస్వామ్య ప్రక్రియలో వారు చురుకుగా పాల్గొనేటట్లు వారిలో స్ఫూర్తిని నింపడం కూడా ఈ కార్యక్రమం ప్రధానోద్దేశాలుగా ఉన్నాయి. దేశ ఓటర్లందరికీ అంకితం చేసిన జాతీయ ఓటర్ల దినోత్సవం, కొత్త ఓటర్ల నమోదును ముఖ్యంగా ఇటీవలే అర్హతను పొందిన యువజనులను ఓటర్ల జాబితాకెక్కించడాన్ని కూడా ప్రోత్సహిస్తోంది. దేశమంతటా, కొత్త ఓటర్లను గౌరవించడంతోపాటు వారికి ఎన్‌వీడీ కార్యక్రమాల నిర్వహణ కాలంలో ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఈపీఐసీ)ని ప్రదానం చేయనున్నారు.

జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలతోపాటు పోలింగ్ కేంద్రం స్థాయిలో కూడా నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం దేశంలో అత్యంత విశాల స్థాయిలో నిర్వహించే ముఖ్య ఉత్సవాల్లో ఒకటిగా పేరుతెచ్చుకొంది.

# ట్రంప్ దెబ్బకు .. నెలలు నిండకుండానే ప్రసవాలకు రెడీఅవుతున్న భారతీయులు..

న్యూ డిల్లీ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రస్తుతం ప్రపంచం మొత్తం అగ్రరాజ్యం వైపే చూస్తోంది. అందుకు కారణం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టడమే. ఆయన రాకతో ఎలాంటి మార్పులు ఉండబోతా యోనన్న భయాలు అన్ని దేశాల్లో నెలకొంది. ఆయన తీసుకునే నిర్ణయాలు అమెరికాలో ఉంటున్న ఇతర దేశాల ప్రజల గుండెల్లో గుబులు నెలకొంది. అమెరికా అధ్యక్ష పగ్గాలను రెండోసారి చేబూనిన డొనాల్డ్ ట్రంప్ మొదటిరోజే వందకుపైగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) సంతకాలు చేసిన విషయం తెలి సిందే. వలసల నుంచి మొదలుకొని పర్యావరణం, వాణిజ్యం వరకు అమెరికాకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల రూపంలో ట్రంప్ అమలులోకి తీసుకొచ్చారు. తన ఆలోచనల అమలులో కఠినంగా ఉండనున్నట్టు ఆయన చెప్పకనే చెప్పారు. ఈ నిర్ణయాలు అమెరికాతో పాటు ప్రపంచంపైనా ప్రభావాన్ని చూపనున్నాయి. ముఖ్యంగా జన్మతః పౌరసత్వం (Birthright Citizenship విధానం రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం..లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ట్రంప్ నిర్ణయంతో ప్రస్తుతం భారతీయుల గుండెల్లో రైళ్లు పరిగెడుతు న్నాయి. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడి తే.. ఆ చిన్నారు లకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

18 68లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకా రం అప్పటి నుంచి ఈ జన్మతః పౌర సత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్ర మ వలసదారులకు, తాత్కాలిక వీసా పై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటిం చారు. ట్రంప్ ఆదేశాలతో ఈ చట్టం వచ్చే నెల అంటే ఫిబ్రవరి 20వ తేదీ నుంచి అమల్లోకి (citizenship dead line) వస్తుంది. అంతకుముందు వరకు అమెరికాలో ఉంటున్న భారతీయులు లేదా ఇతర దేశాల దంపతులకు పుట్టిన బిడ్డలను అమెరికా పౌరసత్వం లభిస్తుంది. ఆ తర్వాత పుట్టిన వారికి ఇది లభించదు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ గర్భిణిలు నెలల నిండక ముందే డెలివరీకి సిద్ధమవుతున్నట్లు అమెరికా మీడియా నివేదిస్తోంది.

కళానిలయం సాంస్కృతిక సంస్థ సేవా సంస్థ Regd: 6284 ✠ శ్రీ త్యాగరాయ గానసభ (ప్రపంచ రికార్డులు పొందిన ఆడిటోరియం)
యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని
ఫణి భార్గవ్ యాదిలో...
నగదు పురస్కారం
శ్రీ గండ్ర నవీన్ గారు సీనియర్ స్టేట్ బ్యూరో రిపోర్టర్, వెలుగు
పి. రాధిక గారు ఎన్.టి.వి. జర్నలిస్ట్
పి. జ్యోతి గారు టీవి 9 క్రైమ్ జర్నలిస్ట్

ఆర్థిక సహకారం: టి. క్రాంతి బి.కాం విద్యార్థికి మరియు అమృత శ్రీవర్షిణి సేవా సంస్థ
ఆత్మీయ సత్కారం : శ్రీ యస్. వినయ్ కుమార్ గారు సీనియర్ సంపాదకులు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కార్యదర్శి
ముఖ్యఅతిథులు
డా॥ కె.వి. రమణ చారి గారు ఐ.ఎ.యస్. (రి) తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు
శ్రీ కె. రామచంద్రమూర్తి గారు ప్రముఖ సంపాదకులు
సభాప్రారంభకులు : లయన్. కళా వి.యస్. జనార్ధన్ మూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
సభాధ్యక్షులు : డా॥ యం.కె. రాము గారు పూర్వ సంచాలకులు, జవహర్ బాలభవన్, రచయిత
అతిథి : శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక
శ్రీమతి రాధిక నృత్య గురువు (కురుగంటి కళాక్షేత్రం) మరియు
శ్రీమతి తులసి నృత్య గురువు (శ్రీ సాయి నటరాజ అకాడమి) శిష్య బృందం చే నృత్యాలు
శ్రీమతి వేమూరి మంజుల లలితగీతాల గానం శ్రీ కొండలరావు బృందంచే పాటలు
27-01-2025 సా॥ 5.00 గం॥లకు, వేదిక : కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి.
శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి త్యాగరాయ గానసభ | డి. దయాకర్ రాజు, కన్వీనర్ 8978500443 | ఎ.సురేందర్, స్థాపక కార్యదర్శి 9550512032 | శ్రీమతి ఎ. పుష్పలత అధ్యక్షులు

# నేతాజీ దేశానికి చేసిన సేవలు గర్వకారణం

**–బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ**



రాజన్న సిరిసిల్ల, జనవరి 23:(నేటినిజం ప్రతినిధి): నేతాజీ దేశానికి చేసిన సేవలు గర్వకారణం అనిబీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, బిజెపి నాయకులతో కలిసిజిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సుభాష్ నగర్ లోని సుభాష్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ చరిత్రలో జయంతి తప్ప, వర్ధంతి లేని మహానీయుడు, గొప్ప స్వాతంత్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. యువతలో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయున్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాన్నారు. దేశ భక్తి, సంస్కృతి, సేవ లాంటివి ప్రతి ఒక్కరిలో ఉండాలని, అదే నేతాజీకి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి రేగుల మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, సీనియర్ నాయకులు, సంటి అంజిబాబు, సంటి మహేష్, కృష్ణ స్వామి, రేగుల రాజు, నామాల శేఖర్, బిల్లా కృష్ణ, బోనాల శివ, యస్వంత్, నృత మహేష్, రంజిత్ రెడ్డి, సిహెచ్ శివ, తడుక రాజు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# ముందు పాతబస్తీలోని ఆక్రమణలు కూల్చండి.. ఎమ్మెల్యే దానం

హైదరాబాద్, జనవరి 23:హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌ల కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నేడు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పేద ప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాలసీ ఉంటే పబ్లిక్ నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ప్రశ్నించారు. అధికారులు చేసే పనులతో తాము ప్రజల మధ్య తిరుగలేకపోతున్నామని చెప్పారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కూల్చివేతను పాతబస్తీ నుంచి ప్రారంభించాలన్నారు. మాదాపూర్‌లో కుమారీ అంటీకి ఇచ్చిన మినహాయింపును అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**–ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**–ఆటో నడిపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల, జనవరి 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వద్ద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు 2025లో భాగంగా నిర్వహిస్తున్న సడక్ సురక్ష అభియాన్ జాగ్రత్త కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిలు పాల్గొని, జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా తిప్పాపూర్ బస్టాండ్ నుండి రాజన్న ఆలయం వరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా ఆటో నడిపారు.

అనంతరం కోరుట్ల బస్టాండ్ వద్ద మానవహారంలో పాల్గొని రోడ్డు భద్రత ప్రమాణం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు.

ప్రతీ ఒక్కరు రోడ్డు ఎక్కిన నుండి ఇంటికి వచ్చే వరకు క్షేమంగా వచ్చేలా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, డ్రైవర్ స్థానంలో కూర్చున్న వారు కొన్ని నియమాలను పాటిస్తూ ఇంట్లో తమ తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారని గమనిస్తూ ముందుకు పోవాలని సూచించారు.

మద్యం సేవించి, సెల్ ఫోన్ లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ఏదైనా అనుకోని ప్రమాదం ఎదురైతే వారి కుటుంబ సభ్యులు కుటుంబ పెద్దను కోల్పోతారని తెలిపారు.



డ్రైవింగ్ చేసే వారూ అప్పుడప్పుడు కొంచెం విశ్రాంతి తీసుకోవాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

ఇలాంటి కార్యక్రమంలో నిర్వహించడం వలన కొంత మందిలో అయిన మార్పు వస్తుందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి చేస్తున్నారని, వాహనదారులు రోడ్డు భద్రతతో పాటు ఆరోగ్య భద్రతా కూడా ఉండేలా చూసుకోవాలన్నారు.

ఆటో యూనియన్ వాళ్లకి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, ఇల్లు లేని ఆటో కార్మికులకు ఇందిరమ్మ మంజూరు చేయిస్తానని అన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులను ఇలాంటి అవగాహన సదస్సుల్లో భాగస్వామ్యం చేయడం వల్ల విద్యార్థులు తమ తమ తల్లిదండ్రులకు ఒక అవగాహన కల్పిస్తారని, పోలీసు వారు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రోండి రాజు, వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్,డిటివో లక్ష్మణ్ ,ఎంవిఐ వంశీధర్, డిపో మేనేజర్ , సీఐ విరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు, కౌన్సిలర్ లు ఆటో యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ పోలీసుకు సరిలేరెవ్వరూ.. డీజీపీ జితేందర్

**–నిబద్ధతకు మారుపేరు తెలంగాణ పోలీసు**

**–ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా విధులు**

**–డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు**

**–రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్**

మెదక్, జనవరి 23:ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వారని, శాంతిభద్రత పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్నారని



డీజీపీ జితేందర్ అన్నారు. తెలంగాణ పోలీసులకు ఎవరూ సాటి లేరన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పోలీసులు పనిచేస్తున్నారన్నారు. గురువారం డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీస్ లో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్ ను ఆవిష్కరించడానికి మెదక్ జిల్లాకు విచ్చేశారు. అనంతరం సెల్యూట్ బేస్ ప్రాంగణాన్ని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు..

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ చెప్పారు. తెలంగాణ పోలీసు పటిష్టంగా ఉందని, టెక్నాలజీని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కేసును త్వరితన ఛేదించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ శాఖ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని చెప్పారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరిగిన 100కు డయల్ చేయాలన్నారు. అర్బన్ ఏరియాలో అయితే పోలీసులు పది నిమిషాలు సంఘటన స్థలానికి చేరుకుంటారని, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 15 నిమిషాల్లో సంఘటనకు చేరుకుంటారన్నారు. పోలీస్ సేవలు ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు.

సరెండర్ లీవులకు రూ.200 కోట్లు..

పోలీస్ సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా తాను ఉన్నట్లు డీజీపీ చెప్పారు. పోలీసులకు సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం దగ్గర తీసుకువెళ్తానన్నారు. సరెండర్ లీవులు బిల్లుల కోసం రూ.200 కోట్లను ప్రభుత్వం రిలీజ్ చేసినట్లు తెలిపారు. ఆరోగ్య భద్రతకోసం రూ. 75 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. రాష్ట్రంలో 100 డయల్ సేవలందించేందుకు 2000 వాహనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపి కి మరో ఇద్దరు న్యాయమూర్తులు.. 30కు చేరిన న్యాయమూర్తుల సంఖ్య

అమరావతి జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగింది. తాజాగా మరో ఇద్దరు న్యాయమూర్తులను నియమించడంతో ఆ సంఖ్య 28 నుంచి 30కు చేరుకుంది. రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ , డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది మూర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ ఇద్దరు శుక్రవారం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశముంది.రాష్ట్ర హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఇద్దరి నియమకంతో ఆ సంఖ్య 30కు చేరుకోగా మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. . వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా , ఆతరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. న్యాయాధికారుల కోటా నుంచి వీరి పేర్లను సుప్రీంకోర్టు(రాబీజూతీవఎవఅనీబీతీబి) సీజే నేతృత్వంలోని కొలీజియం సిఫారస్ చేస్తూ ఈనెల 11న తీర్మానం చేసింది.

# ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టిడిపి పార్టీ ఆఫీస్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో టిడిపి సెంట్రల్ జనరల్ సెక్రెటరీ మరియు ఆంధ్రప్రదేశ్ ఐటి మినిస్టర్ నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా కేక్ కట్ చేస్తూ అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కేడి దినేష్ స్టేట్ ట్రేడ్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు నర్సింలు, బాలాజీ గోస్వామి, సోమశేఖర్ కుర్మా, తదితరులు పాల్గొన్నారు

# భారీగా డబ్బు సంపాదించాలనే ఆశతో.. రోడ్డు రోలర్‌నే దొంగిలించారు..

హైదరాబాద్, జనవరి 23:దొంగలు సహజంగా బంగారం, నగదు, విలువైన సామాగ్రిని దోచుకెళుంటారు. కొన్ని సందర్భాల్లో టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను కూడా అపహరిస్తుంటారు. కానీ ఈ దొంగలు మాత్రం ఎవరూ ఊహించని విధంగా ఓ రోడ్డు రోలర్‌ను దొంగిలించారు. ఈ ఘటన జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. గుల్బార్గాకు చెందిన అఫ్రోజ్, ముస్తాఫా కలిసి ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో.. దొంగతనాలకు పాల్పడుతున్నారు. అయితే సోమవారం రాత్రి అఫ్రోజ్, ముస్తాఫాతో పాటు షేక్ అన్వర్ కలిసి బాలానగర్‌లో నిర్మానుష్య ప్రాంతంలో నిలిపి ఉంచిన రోడ్డురోలర్‌పై కన్నేశారు. దాన్ని దొంగిలించాలని వారు నిర్ణయించుకున్నారు. దీంతో ఓ రెండు భారీ క్రేన్లను తెప్పించుకున్నారు. క్రేన్ల సహాయంతో డీసీఎంలోకి రోడ్డు రోలర్‌ను ఎక్కించి మహారాష్ట్ర వైపు మళ్లించారు.

ఇక తన రోడ్డు రోలర్ మిస్ అయిందని గ్రహించిన దాని యజమాని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. 64 సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ తర్వాత జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలోనే రోడ్డు రోలర్‌ను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఈ దొంగతనం కేసులో అఫ్రోజ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ అన్వర్, బళ్ల రామ్ సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. సయిద్ ముస్తాఫా పరారీలో ఉన్నారు.

అయితే దొంగతనం చేసిన రోడ్డురోలర్‌ను మహారాష్ట్రలోని ఓ స్క్రాప్ దుకాణంలో అమ్మేందుకు నిందితులు ప్లాన్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. గతంలో దూలపల్లి, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో ఓ రోడ్డు రోలర్‌ను దొంగలించి, మహారాష్ట్రలోని జల్నాలో స్క్రావ్ దుకాణంలో అమ్మేసినట్లు నిందితులు తెలిపారు.

# తెలంగాణలో బీసీ నినాదం బలంగా ఉంది : ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, జనవరి 23:కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇష్టానుసారంగా దోచుకుంటుందని, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఒక్క బీసీకి రుణాలు ఇవ్వాలేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య(ఖీ.ఐతీతిబష్ట్రనిజీతిజీష్ట్ర) ధ్వజమెత్తారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంత ఆధ్వర్యంలో గురువారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందన్నారు. బీసీల కులవృత్తుల వారికి బ్యాంకులతో నిమిత్తం లేకుండా నేరుగా బీసీ కార్పొరేషన్ల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పారిశ్రామికరణ ఆదరణ తగ్గడంతో రాష్ట్రంలో బీసీ కులాల వారికి ఉపాధి కరువైందని ఆరోపించారు. బీసీ కుల వృత్తుల వారికి యంత్రాలు కొనుగోలు చేయడానికి రూ.50 లక్షల వరకు రాయితీని అందజేయాలని డిమాండ్ చేశారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం బలంగా ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజ్యాధికార దిశగా ఉద్యామించాలని పిలుపునిచ్చారు. బీసీలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమం వచ్చినప్పడే బీసీల బతుకులు మారుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గౌరిగె మల్లేశ్, నీలం వెంకటేశ్, జి.అంజి, వేముల రామకృష్ణ, నందగోపాల్, రాజు, భాస్కర్, రఘుపతి, ప్రవీణ్‌కుమార్, నిఖిల్, రవియాదవ్, బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

# నేతాజీ దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాది

**– సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ గంగాధర్**




హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కాలేజీలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ విజయ్ కార్యక్రమం ప్రారంభించగా కళాశాల ప్రిన్సిపాల్ డా:టి.గంగాధర్ సార్ , ఏబీవీపీ సిటీ సెక్రెటరీ పృధ్వి తేజ , బేగంపేట్ టౌన్ ప్రెసిడెంట్ నరేందర్ , మారేడుపల్లి టౌన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్వేత, తదితంలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ సా మాట్లాడుతూ నేతాజీ బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాది. అతను తన నాయకత్వ నైపుణ్యాలు,అతని ప్రసంగాలు మరియు స్వాతంత్ర్య ఉద్యమంలో చేరడానికి మిలియన్ల మంది భారతీయులను ప్రేరేపించిన అతని సైనిక వ్యూహాలకు విస్తృతంగా గుర్తింపు పొందాడు అన్ని అన్నారు... ఏబీవీపీ సిటీ సెక్రెటరీ పృథ్వీతేజ గారు మాట్లాడుతూ ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగం విడిచిపెట్టి దేశ స్వాతంత్ర్యం కోసం కదనరంగంలో దూకిన ధైర్యశాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, బ్రిటిష్ వారిని మనదేశం నుంచి తరిమికొట్టడానికి సైనిక చర్య ద్వారానే సాధ్యం అని నమ్మి ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి ఎందరో యువకులను స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేటట్టు చేశాడు. 'మీ రక్తాన్ని ఇవ్వండి – నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ఉగ్రూతలూగించిన నేతాజీ మన అందరికి నేటికీ ఆదర్శం అనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా నేటి యువత చాలా సమయాన్ని వృథాగా గడుపుతోందని,ఇది ఏమాత్రం వారికిగాని, దేశానికిగాని ఉపయోగకరం కాదు. దేశం కోసం నేను ఏమి చేయాలో ఇకనైనా ఆలోచన చేయాలి. చదువుల్లో రాణించాలి. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. 'నోబెల్ బహుమతి' సాధనలో నిమగ్నమవ్వాలి. ఒలింపిక్ క్రీడలలో పతకాలు సాధించేందుకు ఆరాటపడాలి. నేతాజీ నూరిపోసిన దేశభక్తి ని అందిపుచ్చుకుని సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలి. విచ్ఛిన్నకర మైన శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలి. నేతాజీ జన్మదినాన్ని 'పరాక్రమ దివస్'గా జరుపుకుంటున్న నేటి సమయంలో, భవిష్యత్తులో 'వికసిత్ భారత్' సాధనలో నేటి యువత అన్ని రకాల సామర్థ్యలతో, నైపుణ్యాలతో భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చుటలో ప్రధాన భూమిక పోషించాలని కోరుకుంటున్నాను అన్ని అన్నారు.

# కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత

**–కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్ జనవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు.కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల.. అని హరీశ్‌రావు ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్య లు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# 2025-26 సీజనుకు ముడి జనపనార కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పీ) ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 23:2025-26 మార్కెటింగ్ సీజనును దృష్టిలో పెట్టుకొని ముడి జనపనారకు కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పీ)ను ఖరారు చేయడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) సమావేశం ఆమోదం తెలిపింది.

ముడి జనుము (టీడీ-3 గ్రేడు)కు ఎంఎస్‌పీని 2025-26 సీజనుకు ఒక్కొక్క క్వింటాలుకు రూ.5,650గా ఖరారుచేశారు. ఇది అఖిల భారత స్థాయిలో ఉత్పత్తి సంబంధిత వెయిటెడ్ ఏవరేజ్ ఖర్చులపైన 66.8 శాతం రాబడినిస్తుంది. అఖిల భారత స్థాయిలో వెయిటెడ్ ఏవరేజ్ ఉత్పాదక వ్యయంతో పోలిస్తే తక్కువలో తక్కువగా 1.5 రెట్ల వద్ద ఎంఎస్‌పీని ఖాయపరచాలన్న సూత్రాన్ని 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. 2025-26 మార్కెటింగ్ సీజనుకుగాను ముడి జనుముకు ఆమోదం తెలిపిన ఎంఎస్‌పీ ఈ ప్రకటనకు అనుగుణంగా ఉంది.

మార్కెటింగ్ సీజను 2025-26కు గాను ముడి జనుము ఎంఎస్‌పీలో అంత క్రితం 2024-25మార్కెటింగ్ సీజనుకు ప్రకటించిన దానితో పోలిస్తే ఒక్కో క్వింటాలుకు రూ.315 మేర వృద్ధి ఉంది. భారత ప్రభుత్వం 2014-15లో ముడి జనుము క్వింటాలుకు రూ.2400గా ఉన్న ఎంఎస్‌పీని 2025-26కు ప్రతి క్వింటాలుకు రూ.5,650కి పెంచింది. అంటే దీనిలో క్వింటాలు ఒక్కింటికి రూ.3250 మేర పెంపు (2.35 రెట్లు) ఉందన్న మాట.

జనుమును పండించిన రైతులకు 2014-15 నుంచి 2024-25 మధ్య కాలంలో చెల్లించిన ఎంఎస్‌పీ రూ.1300 కోట్లుగా ఉంది. కాగా 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించింది రూ.441 కోట్లే.

నలభై లక్షల వ్యవసాయ కుటుంబాల బతుకుతెరువు జనుము పరిశ్రమపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి ఉంది. దాదాపుగా 4 లక్షల మంది శ్రామికులు జూట్ మిల్లుల్లో, జనుము వ్యాపార కార్యకలాపాల్లో ఉపాధిని పొందుతున్నారు. 82 శాతం మంది జనపనార రైతులు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు. కాగా, జనుము ఉత్పత్తిలో అసోం, బిహార్‌లు చెరో 9 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

ధరల పరంగా మద్దతిచ్చే కార్యకలాపాలను చేపట్టడానికి జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా తన పాత్రను నిర్వహించడాన్ని కొనసాగించనుంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.